J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 41 18.3.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### వైసిపి నాయకులకు ఏప్రిల్ నుండి

# అసెంబ్లీ ప్రవేశ పరీక్ష

## కొత్త జిల్లాలు - కొత్త మంత్రులు - కొత్త పుంతలు




జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అధికారంలో వచ్చిన వెయ్యి రోజుల తరువాత... అంటే సుమారు మూడేళ్ళ తరువాత శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఒక్క అసెంబ్లీ సమావేశాలలో తప్ప తమ ముఖ్యమంత్రిని నేరుగా చూడలేకపోతున్నామని మదనపడుతుండిన చాలామంది శాసనసభ్యులకు అబ్బా ఆయనను నేరుగా కలుసుకోబోతున్నామన్న ఆనందం కూడా కలిగింది. అయితే, ఆ సమావేశంలో తమ నాయకుడు పేల్చిన సర్వే బాంబుతో ఆ ఆనందం ఆవిరై కొత్తభయం పట్టుకుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసేవాళ్ళలో తమ పేరు ఉంటుందా... లేదా...? అన్న గుబులు చాలామందిలో మొదలైపోయింది. తాజాగా జరిగిన పార్టీ లెజిస్లేచర్ల సమావేశంలో భవిష్యత్తులో టిక్కెట్లు కోల్పోయే 50 మంది పేర్లు ఇప్పటికే తన దగ్గర ఉన్నాయని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడంతో ఇప్పుడా పార్టీలో ఇదే పెద్ద చర్చనీయాంశంగా మారింది.

త్వరలో మంత్రివర్గంలో మార్పులు ఉంటాయని తీపి వార్త 10లో

### మొన్నటి గెలుపు... బలుపా.. వాపా..?

# ఉత్తరాన సరే.. మరి దక్షిణానో?

## సత్యకుమార్‌కి ఆంధ్రా బీజేపీ పగ్గాలు?




మొత్తానికి మొన్న జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో బీజేపీ శ్రేణులలో జోష్ పెరిగింది. ఉత్తరప్రదేశ్‌తో పాటు ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాలలో ఆ పార్టీ జయకేతనం ఎగురవేయడం ఒక విధంగా ఆ పార్టీకి ఆక్సిజన్ లాంటిదే. రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత మోడీ హవా తగ్గిందని ప్రచారం చేస్తున్నవారి నోళ్ళు మూయించడానికి ఈ ఫలితాలు బాగా ఉపయోగపడతాయి. కానీ, ఈ రాష్ట్రాలలో ప్రతిపక్షాలు బలంగా లేవు అనే విషయం బహిరంగ రహస్యం. అయితే... మొన్నటి ఫలితాలు భాజపాకి బలుపా... వాపా...? అన్నది ఇక్కడ ప్రస్తావనార్హం. కేంద్రంలో కమలం పార్టీకి ప్రత్యామ్నాయం లేదు కాబట్టి ఈ ఫలితాలొచ్చి వుంటే అది వాపే. ఆలా కాకుండా ఆ పార్టీ సిద్ధాంతాలను గౌరవించి, భారతీయ ఓటర్లు హిందుత్వానికి మద్దతు పలుకుతుంటే అది బలుపే.

మోడీ, అమిత్‌షాల ద్వయం భారతదేశాన్ని అదానీ, అంబానీలకు తాకట్టు 3 లో

### ఏకై.. మేకై.. ఏకమై...

# పవర్ చూపిస్తానంటున్న పవన్

## పోటెత్తుతున్న జనం.. ఓటెత్తుతారా?



మార్చి 15న జనసేనాని మరోసారి గర్జించారు. తన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను గుంటూరుజిల్లా ఇప్పటంలో ఘనంగా నిర్వహించింది ఆ పార్టీ. విశేష సంఖ్యలో జనం ఈ సభకు తరలివచ్చారు. తన సహజ స్టైల్లో మంచి పంచ్ డైలాగులతో, యాస ప్రాసలతో సభను రక్తికట్టించారు ఆ పార్టీ అధ్యక్షుడు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్. 2019లో ఆయన పోటీచేసిన రెండుచోట్ల ఆయన ఓడిపోయారు. అయినా, ఆయన పట్టువదలని విక్రమార్కుడిలాగా తపన పడుతూనే ఉన్నారు. 2014 ఎన్నికలప్పటి నుండి తన ప్రభావంతోనే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాయన్న భ్రమలో ఉన్నాడు పవన్. ఆ భ్రమలోనే 2019లో పార్టీ పెట్టి పోటీచేసి ఓటమిలో కూడా తనకెవరూ లేరు సాటి అనిపించుకున్నాడు. ఇప్పుడు బీజేపీతో దోస్తీ చేస్తున్నాడు. భాజపా కూడా గుడ్డిలో మెల్ల అన్నట్లుగా 'ఏ చెట్టూ లేనిచోట ఆముదం చెట్టే మహావృక్షం' అన్నట్లుగా ఆంధ్రాలో పవన్‌తో స్నేహానికి ఓకే చెప్పింది. 10లో



# ఏఎస్ఐలుగా మహిళా హెడ్‌కానిస్టేబుళ్ళు



ఎస్పీ విజయారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళా హెడ్‌కానిస్టేబుళ్ళు

జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఏడుగురు మహిళా హెడ్‌కానిస్టేబుళ్ళకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఆమేరకు ఇటీవల ఉత్తర్వులిచ్చారు. కావలి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వి.పద్మావతి, దక్కిలిలో ఉన్న ఎం.శోభారాణి, దిశ పోలీస్‌స్టేషన్‌లో జె.రంజని, చిట్టమూరులో పనిచేస్తున్న కె.కమలమ్మ, గూడూరు రూరల్‌లో ఉన్న వి.విజయశ్రీ, సిసిఎస్‌లో పనిచేస్తున్న టి.విజయకుమారి, జలదంకిలో బి.శైలజాకుమారిలు ఇక ఏఎస్ఐలుగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పోలీస్‌స్టేషన్‌లలోనే పనిచేయాలని, మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించి పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలని ఎస్పీ వారికి సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన వారంత నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి తమ కృతజ్ఞతలు చెప్పారు.

### కామాక్షితాయి అమ్మవారికి

# ముత్యాలచీర బహుకరణ



జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి నెల్లూరుకు చెందిన మాగుంట జయప్రద ఈనెల13న ముత్యాలచీరను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. మధురైలో ఈ చీరను ఆమె ప్రత్యేకంగా తయారుచేయించి అమ్మవారికి సమర్పించినట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. అనంతరం అమ్మవారికి ముత్యాలచీరను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ఆలయ ధర్మకర్తలు నందకుమార్, శివ, కౌన్సిలర్లు లక్ష్మీకాంతమ్మ, ప్రత్యూష, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామ చరితను తెలిపే గ్రంథత్రయం..

# 'శ్రీ సీతారామ కల్యాణం'



శ్రీమద్రామాయణంలోని బాలకాండ, పద్యసప్తశతి, సీతారామ కల్యాణం గ్రంథత్రయంగా వెలువరించడం ఒక బృహత్తర కార్యక్రమమని, దానిని తనదైన శైలిలో అద్భుతంగా రచించిన కోట రాజశేఖర్ అభినందనీయుడని వక్తలు కొనియాడారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ రచించిన 'శ్రీ సీతారామ కల్యాణం' గ్రంథత్రయాన్ని పద్యసారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ వారు స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామ స్వామి మందిరంలో ఈనెల 12న పలువురు ప్రముఖుల చేతులమీదుగా ఘనంగా ఆవిష్కరించారు. వాల్మీకి రామాయణంలోని శ్లోకాలు, వాటికి సరైన తెలుగు పద్యాలు, తాత్పర్యాలను ఒక గ్రంథంగా వెలువరించగా, ఆ గ్రంథాన్ని మెట్టు రామచంద్రప్రసాద్ ఆవిష్కరించారు. అనువాద పద్యాలు మాత్రమే ఉన్న గ్రంథాన్ని శతావధాని సూరం శ్రీనివాసులు ఆవిష్కరించారు. వచన గ్రంథాన్ని నలుబోలు బలరామయ్యనాయుడు ఆవిష్కరించారు. అధ్యక్షులు పోలవరపు లక్ష్మీ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు సభను నిర్వహించి గ్రంథకర్తను ఘనంగా సన్మానించారు. గ్రంథావతారిక పద్యాలు చిత్రీకరింపబడిన వీడియో సీడీని అగస్త్యరాజు సుబ్బారావు ఆవిష్కరించగా బాలకాండ పద్య సప్తశతి ఆడియో సీడీని శ్రీ సీతారామమందిరం కమిటీ అధ్యక్షులు అమర్లలూరు వేంకటేశ్వరగుప్తా ఆవిష్కరించారు. వ్యాస మహాభారతం అనువాదకులు సూరం శ్రీనివాసులు గ్రంథసమీక్ష చేశారు. కోట రాజశేఖర్ సహాధ్యాయి టి.రామన్న తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం కవులు పండితులు ఆలయ నిర్వాహకులు అందరూ గ్రంథకర్త రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్తలు పేరిసెట్ల శివకుమార్, బృందావనరావు, సూరం చంద్రశేఖర్, కొండపి మురళీకృష్ణ, తంగిరాల వేంకట నరసింహకుమార్, మర్రి వెంకటరావు, గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఐసిడిఎస్ ఉద్యోగుల..

# కొత్త కార్యవర్గం

ఐసిడిఎస్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. నెల్లూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా ఎన్. గిరిధర్, కార్యదర్శి జిఆర్ విక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని నాయకులు తెలిపారు. అదేవిధంగా సహాయ అధ్యక్షురాలిగా ఎస్‌కె ఆశాబేగం, కార్యదర్శిగా జిఆర్ విక్రమ్, కోశాధికారిగా పి.తిరుపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.పద్మ, ఉపాధ్యక్షులుగా ఆర్.సుజనమ్మ, జి.సుకన్య, పి.జయప్రకాష్‌నారాయణ, ఐవి శేషమ్మ, అమ్మణ్ణమ్మ, జాయింట్ సెక్రటరీలుగా పి.చంద్రశేఖర్, డి.పద్మావతి, పి.విజయలక్ష్మి, కె.రాజేశ్వరి, వి.శకుంతల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్.సునీత, పి.శిరీష, హస్సేన్‌సాహెబ్‌లు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

### అంతర్జాతీయ పోటీల్లో..

# బొగ్గరపు కవితకు బహుమతి



ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల జరిగిన అంతర్జాతీయ వచన కవితల పోటీల్లో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి రాసిన 'ప్రశ్న యుద్ధం గురించి కాదు' అనే కవితకు ప్రోత్సాహక బహుమతి లభించింది. 'కవిసంధ్య' ద్వై మాసపత్రిక–ద్వానా సాహితీ కుటీరం సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. మార్చి 20న యానాంలో జరిగే 'అంతర్జాతీయ యానాం కవితోత్సవం'లో విజేతలకు నగదు బహుమతులిచ్చి సత్కరిస్తారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, గంగిశెట్టి శివకుమార్ తదితరులు రాధాకృష్ణమూర్తిని అభినందించారు.

### 28,29 తేదీల్లో

# సార్వత్రిక సమ్మె

### జయప్రదం చేయాలన్న సిఐటియు నాయకులు



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 28, 29 తేదీల్లో చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకుడు ఎం.మోహన్‌రావు పిలుపునిచ్చారు. నాయుడుపేటలో ఈనెల 13న ఏర్పాటు చేసిన సిఐటియు నాయుడుపేట మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. కార్మికులంతా ఏకమై అలాంటి విధానాలను నిరసించాలన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.మహేష్, కార్యదర్శి ముకుంద, నాయకులు వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ శారదను..

# సత్కరించిన మహిళా ఉద్యోగులు



జిల్లా గ్రంథాలయ సంస్థకు తొలి మహిళా ఛైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటగిరి మునిసిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ దొంతు శారదను జిల్లా గ్రంథాలయ సంస్థ మహిళా ఉద్యోగులు ఇటీవల ఘనంగా సత్కరించారు. నెల్లూరులోని దొడ్ల పద్మావతమ్మ మహిళా గ్రంథాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి అందరం కట్టుబడి పనిచేద్దామని, ఉద్యోగులంతా ఆ దిశగా కృషిచేయాలని ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ వారితో అన్నారు. నగరంలోని 8వ డివిజన్ మహిళా కార్పొరేటర్ కామాక్షిదేవి మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నగరపాలక సంస్థ ద్వారా అవసరమైన సహకారాన్నంతా అందిస్తామన్నారు. దగదర్తి శాఖ గ్రంథాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన లైబ్రేరియన్ పి.ఆదిలక్ష్మిని సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సిహెచ్ ప్రసాద్, మహిళా ఉద్యోగినులు ఏ.రేవతి, మేరిగ్రేస్, గిరిజ, పి.మంజుల, కె.రాజేశ్వరి, ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

# అధిక ఉప్పు.. ఆరోగ్యానికి ముప్పు

### - న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్



మనం తినే ఆహారంలో ఉప్పు చాలా మితంగానే వాడుకోవాలే తప్ప ఎక్కువగా వాడితే ఆరోగ్యానికి ముప్పు తప్పదని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ చెప్పారు. ఈనెల 13న మర్రిపాడు మండల పరిధిలోని ఇర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో నెల్లూరులోని అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడుతూ ఆహారంలో ఉప్పు కేవలం 5 శాతం మాత్రమే వాడాలని, అయితే ముఖ్యంగా గ్రామీణ ప్రజలు 10 శాతం దాకా ఉప్పును కూరల్లో వాడుతున్నారని, నిత్యం అలా ఉప్పును అధికంగా తినడం వల్ల ఆరోగ్యానికి సమస్యలు వస్తాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు వాటి నివారణ గురించి జిల్లాలోని 32 గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. బిపి, షుగర్, పక్షవాతం, మూర్ఛ, తలనొప్పి తదితర వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. తొలుత సుమారు 100 మంది రోగులను పరీక్షించి వారికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఇర్లపాడు సర్పంచ్ గుర్రం శ్రీనివాసులు, పెగళ్ళపాడు సర్పంచ్ ప్రణవి శ్రీనివాస్, ఖాదర్‌పూర్ సర్పంచ్ ఏ.కృష్ణారెడ్డి, దుద్దుగుంట సుప్మ తదితరుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది.

# ధ్యానంతో ప్రశాంత జీవనం



నిత్యం క్రమం తప్పకుండా కనీసం ఓ గంటపాటు ధ్యానం చేస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుందని, శారీరక సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని, తద్వారా ప్రశాంత జీవనం గడపవచ్చని ప్రముఖ పిరమిడ్ ధ్యాన మాస్టర్ భీమనేని వంశీకిరణ్ అన్నారు. ఆత్మకూరులోని షిరిడీసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈనెల 13న ఆయన ప్రత్యేక ధ్యాన శిక్షణా తరగతులు నిర్వహించారు. ధ్యానం చేయడం ఎంతో మంచిదని, శ్వాస మీద ధ్యాస పెట్టి మౌనంగా ధ్యానం చేసుకుంటే అదే అలవాటవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ధ్యానకేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ – ప్రగతి వితరణ

నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఉన్న నగరపాలక ఉన్నతపాఠశాలకు 'లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రగతి' ఆధ్వర్యంలో ఈనెల 14న మూడు కుట్టుమిషన్లను తమ వితరణగా అందించారు. విద్యార్థినులకు కుట్టుపనిలో శిక్షణ ఇచ్చేందుకు వాటిని పాఠశాల హెడ్‌మాస్టర్ మంజులావాణికి అందజేశారు. లయన్స్‌క్లబ్–ప్రగతి అధ్యక్షుడు మధుసూదన్ రావు, కార్యదర్శి సుధీర్‌కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాన సరే.. మరి దక్షిణానో?

(మొదటి పేజీ తరువాయి)



పెడుతున్నారని లోకం కోడైకూస్తున్న తరుణంలో ఆ పార్టీ నాలుగురాష్ట్రాలను కైవసం చేసుకోవడం ఆశ్చర్యకరమే అని పరిశీలకులు వ్యాఖ్యాని స్తున్నారు. బహుశా బీజేపీకి కూడా ఇది ఊహిం చని ఫలితం అనే చెప్పొచ్చు.

## మరి దక్షిణాది రాష్ట్రాల సంగతేంటి...?

ఉత్తరాది సంస్థలకు, వ్యక్తులకు ఇస్తున్న ప్రాముఖ్యతను కమలనాథులు దక్షణాది రాష్ట్రాల వారికి ఇవ్వడంలేదన్న అపవాదు కూడా ఆ పార్టీ మూటకట్టుకుంటోంది. ముంబై విమానాశ్రయాన్ని జీవీకే నుండి లాక్కుని ఆదానీలకు కట్టబెట్టడం, ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం ఓడ రేవుని కూడా నవయుగను తప్పించి ఆదానీలకే అప్పజెప్పడం, గంగవరం పోర్ట్ కూడా అదానీల పరం చేయడం దక్షిణాది రాష్ట్రాలవారిపై మోదీ బృందం చూపిస్తున్న సవతి ప్రేమకు నిదర్శనంగా మేధావులు పేర్కొంటున్నారు. హిందుత్వంతో పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు దక్షిణాది రాష్ట్రాలలో కొదవేమీ లేదు. ఉత్తర భారతదేశంతో సమానంగా ఇంకా చెప్పాలంటే ఇంకా ఎక్కువగా దక్షిణాదిలో హిందూ దేవాలయాలున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అనేక పుణ్యక్షేత్రాలకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు ప్రసిద్ధి. హిందుత్వ నినాదమే భారతీయ జనతా పార్టీకి కవచకుండలమైతే ఆ పార్టీ ప్రభ దక్షిణ రాష్ట్రాలలో కూడా వెలిగిపోవాలి. అలా వెలిగినప్పుడు ఖచ్చితంగా నిన్నటి విజయం బలుపే అని చెప్పొచ్చు. కానీ, పరిస్థితి అలా లేదు. తెలంగాణలో బండి సంజయ్ ఆ పార్టీలో దమ్ము, ధైర్యం, చరిష్మా ఉన్న నాయకుడిగా కనపడుతున్నాడు. తమిళనాడులో మాజీ ఐపిఎస్ అధికారి అన్నామలై కొంతలో కొంత పార్టీకి ఊపిరి పోసే ప్రయత్నం చేస్తున్నాడు. కర్ణాటకలో నళిన్‌కుమార్ కూడా పార్టీకి ఓ ఊపు తేవడానికి తపన పడుతున్నాడు. ఇక కేరళ సంగతి చెప్పనక్కరలేదు ఇక్కడ సురేంద్రన్‌కి వ్యక్తిగతంగా ఆకర్షణ ఉన్నా పార్టీకి ఆదరణ కరువే. ఒక్క ఆంధ్రాలో తప్ప మిగిలిన అన్ని దక్షిణాది రాష్ట్రాలలో పార్టీ అధ్యక్షులంతా యువకులే. అంతా అయిదు పదుల వయసున్న వారే. మరి ఆంధ్రాలో మాత్రం మొన్నటివరకు కన్నా, ఆయన తరువాత సోము. ఆయన పేరులో వీరత్వం ఉంది తప్ప పనిలో పసలేదు. ముఖంలో కళ లేదు. బుర్రలో గుజ్జు లేదు. ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర శాఖ అధినేతకు ఉండాల్సిన లక్షణాలు ఏమీ లేవని బీజేపీ నేతలే అంటుంటారు. అలాంటి వారికి పార్టీ పగ్గాలు అప్పజెప్పడంతో ఆంధ్రాలో పార్టీ భవిష్యత్తు కనుచూపుమేరలో కనిపించడంలేదు.

రాష్ట్రంలో తెలుగుదేశం దాదాపుగా చతికలపడిపోయింది. కాంగ్రెస్‌పార్టీకి అడ్రస్సే లేదు. ఇలాంటి తరుణంలో అక్కడక్కడా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నా ప్రత్యామ్నాయం భూతద్దం పెట్టి వెతికినా కనపడడం లేదు. రాష్ట్రంలో గ్యాప్ ఉంది, స్కోప్ ఉంది, హోప్ ఉంది కానీ భాజపాకి రూట్ మ్యాప్ లేదు.

అసలు దక్షిణాది వారిని ఉత్తరాది పెద్దలు ఎదగనిస్తారా..? అన్నది కూడా ప్రశ్నార్ధకమే. రాజకీయంగా అత్యంత ప్రతిభతో భవిష్యత్తులో భారత ప్రధాని అవుతారనుకున్న తెలుగు తేజం మన వెంకయ్యనాయుడు లాంటి వారిని అత్యంత చాకచక్యంగా ఉపరాష్ట్రపదవికి ఎంపిక చేయడంలోనే దక్షిణాది వారిపై ఉత్తరాది వారికున్న సవతి ప్రేమ బట్ట బయలు అవుతుంది. ఇప్పుడు కొత్తగా దక్షిణ రాష్ట్రాలలో గుర్తింపు పొందడం కోసం వెంకయ్యను రాష్ట్రపతిని చేస్తారని కూడా వార్తలొస్తున్నాయి. అలా జరిగితే కొంతలో కొంత ఉపశమనం.

రాజకీయాలకు సంబంధంలేని పదవులలో మనవాళ్ళని కూర్చోబెట్టి రాజకీయ పదవులు మాత్రం వాళ్ళే పంచుకుంటారన్న అపవాదును కూడా బీజేపీ మోస్తోంది. లోతుగా ఆలోచిస్తే ఇది నిజమేనా అన్న అనుమానం సామాన్యుడికి సైతం రాక మానదు.


## రాష్ట్ర బాధ్యత సత్యకుమార్‌కి..?

భాజపాని గట్టెక్కించడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ దేశంలో ఇతర చోట్ల తనకు అప్పజెప్పిన ప్రాంతాలలో పార్టీని విజయపథంలో నడిపిస్తున్న యువనేత, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్. ఇటీవల ఉత్తరప్రదేశ్ ఎన్నికల సమయంలో కూడా తనపై ఉంచిన బాధ్యతని సమర్ధనీయంగా నిర్వహించిన వ్యక్తి ఆయన. అలాంటి వ్యక్తికి ఆంధ్ర పార్టీ పగ్గాలు ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం కూడా ఇప్పుడు రాష్ట్ర పార్టీ వర్గాలలో బలంగా వినవస్తోంది. యువకుడు, ఉత్సాహవంతుడు, 'వెంకయ్య స్కూల్'లో తర్ఫీదు పొందిన అపర చాణుక్యుడు సత్యకుమార్. అటువంటి వాడికి ఆంధ్ర పార్టీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీలో నూతనో త్సాహం నిండడమే కాకుండా అనూహ్య ఆదరణ కూడా లభిస్తుందని ఎక్కువమంది ఆంధ్రా కమలనాథుల అభిప్రాయం. పార్టీలో సంచలనాత్మక మార్పులు తెచ్చి, నవ నాయకత్వాన్ని ఏర్పాటుచేసి భాజపాని ఆంధ్రలో అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరలింప చేయతగిన శక్తియుక్తులు సత్యకుమార్‌కి ఉన్నాయన్నది కూడా వారి అభిప్రాయం. ముందుగా తన సొంత రాష్ట్రంలో తన సమర్ధతను చూపించే అవకాశం ఆయనకు ఇస్తే కమలం పార్టీకి కొత్త కళ వచ్చినట్లే అని కూడా ఆ పార్టీ యువ కార్యకర్తలు భావిస్తున్నారు. పార్టీ సముచిత నిర్ణయం తీసుకుని ఆయనకు ఆంధ్రా పార్టీపగ్గాలు ఇస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ శ్రేణుల కోరిక ఢిల్లీ దాకా చేరి సత్యకుమార్‌ని ఆంధ్ర బీజేపీకి దశ దిశా నిర్దేశించే చుక్కానిగా నియమిస్తారేమో వేచిచూడాలి.

నిన్నటి ఫలితాలు బలుపా... వాపా అన్నది ఆ పార్టీ రేపటి నిర్ణయాలపై ఆధారపడి ఉందన్నది ఎవరూ కాదనలేని సత్యం.

# సముద్రతీర ఖనిజానికి ఆమోదం ఇచ్చారా?

## - పార్లమెంట్‌లో ప్రశ్నించిన నెల్లూరు ఎంపీ ఆదాల



ఆంధ్రప్రదేశ్‌లోని 14 సముద్రతీర ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారా?..అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఈనెల 16న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆ లీజుకు ఆమోదం తెలపడానికి ఎంత వ్యవధి పడుతుందని కూడా అడిగారు. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ అందుకు రాతపూర్వకంగా సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 17 ప్రతిపాదనలు అటామిక్ ఎనర్జీ విభాగానికి అందాయని తెలిపారు. 18,367 హెక్టార్ల ప్రాంతంలో విశాఖజిల్లాలోని భీమునిపట్నంలో 90.15 హెక్టార్లు, కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో 1978.471 హెక్టార్ల కోసం గత ఏడాది మార్చి 25న, ఏప్రిల్ 15న లేఖలు అందాయని తెలిపారు. అయితే గత ఏడాది జూన్ 11న వచ్చిన ఒక లేఖ మేరకు సముద్రతీరంలో పర్యావరణానికి నష్టం కలిగించే చర్యలు, లీజు ఉల్లంఘనలపై లోతుగా పరిశీలించి వివరాలు అందించాలని కోరినట్లు తెలిపారు. గత ఫిబ్రవరి 16న అదనపు సమాచారాన్ని కోరుతూ ఒక లేఖ రాసినట్లు తెలిపారు. దానికి ఇంతవరకు సమాధానం అందలేదని పేర్కొన్నారు.

### రుతుపవనాల అంచనాలో.. వాతావరణశాఖ ఖచ్చితంగా ఉందా?

ప్రస్తుతకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ శాఖ అంచనా ఖచ్చితంగా ఉందా?.. భారీవర్షాలు రావడానికి గల కారణాలను గుర్తించిందా?.. అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఈ విషయంలో శాస్త్రీయ పురోగతి ఉంటే దానికి ఆధారాలు తెలపాలని కూడా అడిగారు. దీనికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాతపూర్వకంగా సమాధానమిస్తూ భారత వాతావరణ విభాగం గత ఏడాది దక్షిణ రుతుపవనాల కాలానుగుణ చిత్రాలను అందించిందని తెలిపారు. నైరుతి రుతుపవన కాలంలో గమనించిన వర్ష పాతం పంపిణీ చిత్రాల ప్రకారం సాధారణ వర్షపాతం కురిసినట్లు శాఖ అంచనా వేసిందని పేర్కొన్నారు. ఇచ్చిన మూడు చిత్రాల్లో 1డీలో ఇచ్చిన వర్షపాతం అంచనాకు మించి 20శాతం అదనంగా కురిసిందని తెలిపారు. ఎర్త్ సైన్సెస్ విభాగం రుతుపవన వర్షపాతం కోసం డైనమిక్ ప్రొడక్షన్ సిస్టంను అభివృద్ధి చేసేందుకు నేషనల్ మాన్సూన్ మిషన్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అన్ని వాతావరణాల ఆధారిత ప్రకృతి వైపరీత్యాల అంచనాలను నిర్వహిస్తూ సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు.

### ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా మళ్లీ ద్వారకానాథ్



రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా 'సుడా' ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ రెండవసారి ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఆర్యవైశ్య మహాసభలో ఈ ఎంపిక జరిగింది. అనంతరం ప్రముఖులంతా ద్వారకను అభినందించి ఘనంగా సత్కరించారు. తనను రెండవసారి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని, ఆర్య వైశ్యుల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేస్తానని ద్వారకానాథ్ అన్నారు.

### రాష్ట్ర ఉత్సవాలుగా అమరజీవి జయంతి



ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులుబాసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని రాష్ట్ర ఉత్సవాలుగా రాష్ట్రమంతా జరుపుకోవడం తెలుగు ప్రజలకు, జిల్లావాసులకెంతో గర్వకారణమని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అన్నారు. దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఆయన ప్రాణత్యాగం ఫలితమేనని ఆయన అన్నారు. ఈనెల 16న అమరజీవి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. జేసీలు హరేందిరప్రసాద్, రోజ్‌మాండ్, మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, నగరంలోని ఆత్మకూరు బస్టాండులో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

### ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంపై..
## ప్రత్యేక తపాలా కవరు




ఉదయగిరిలోని చెక్క నగిషీ కేంద్రం జాతీయస్థాయిలో పేరు గాంచిన విషయం అందరికీ తెలిసిందే. తాజాగా ఆ కేంద్రానికి మరింత ఖ్యాతిని తెస్తూ తపాలా శాఖ ప్రత్యేక తపాలా కవరును ఈనెల 16న ఆవిష్కరించింది. పోస్టుమాస్టర్ జనరల్ సయ్యద్ రషీద్, జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్‌బాబు ఈ కవరును ఆవిష్కరించి స్థానిక చెక్కనగిషీ కేంద్రం కళాకారులకు అభినందనలు తెలిపారు. తపాలా సేవలు నిరుపేదలకు, సామాన్యులకు కూడా అందాలని, అప్పుడే తపాలా పురోగతి సాధ్యమవుతుందని సయ్యద్ రషీద్ చెప్పారు. ఆ దిశగా ఉద్యోగులు, సిబ్బంది కృషిచేయాలని సూచించారు. కాగా, మెరిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తపాలాశాఖ సిబ్బందితో నిర్వహించిన సింహపురి పెక్స్-2022 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఏఎస్‌పిలు ప్రసాద్, శ్రీనివాస మల్లికార్జున, ఇన్స్‌పెక్టర్లు సుధీర్‌బాబు, నటరాజకుమార్, సుధాకర్, పోస్టుమాస్టర్ దినకర్ కుమార్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


లాయర్
విజయపథంలో నెల్లూరీయులు






కాఫీటేబుల్ బుక్ కొరకు
9246431984 నెంబరుకు
గూగుల్‌పే లేదా ఫోన్‌పే
ద్వారా రూ.1,000/- (వెయ్యి రూపాయలు)
పంపించి పొందవచ్చును.
వాట్సాప్ ద్వారా మీ ఫోన్ నెంబరు,
చిరునామా తెలియజేస్తే..
కొరియర్ / ర్యాపిడో ద్వారా మీకు పంపిస్తాం.
- మేనేజర్, సర్కులేషన్

నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లాయర్ పత్రిక కార్యాలయం నందు కూడా పొందవచ్చును.

## 'ప్రభా'తం

మాయలమారి కరోనా మళ్ళీ ప్రపంచాన్ని భయపెడుతోంది. ఇప్పుడిప్పుడే కాస్తంత తగ్గుతోందిలే అనుకుని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో 'తగ్గేదే లే'.. అంటూ మానవాళిని మరింతగా బెంబేలెత్తి స్తోంది. ఇప్పటికే పలు రకాల వేరియంట్‌లు (రూపాలు)తో, కంటికి కనిపించకుండానే మారణహోమం సృష్టిస్తున్న సూక్ష్మక్రిమి తాజాగా మరో రూపం దాల్చిందనే సమాచారం ప్రపంచాన్ని కలవరపెడుతోంది. ఒమిక్రాన్‌కు సంబంధించిన మరో రూపమే 'బిఏ-2' అనేది. ఈ సరికొత్త కరోనా అవతారానికే 'స్టెల్త్ ఒమిక్రాన్ వేరియంట్' అనే పేరు పెట్టారు. ఇది ఒమిక్రాన్ కంటే వేగంగా వ్యాపిస్తుందని, దీని తీవ్రత ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తుందని కూడా అంటున్నారు. ఒమిక్రాన్ రూపాలైన బిఏ-1, బిఏ-2లు రోగనిరోధకశక్తిని కూడా లెక్కచేయకుండా వ్యాధిని కలిగించేవిగా ఉంటున్నాయని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. అందులోనూ కరోనా వైరస్ బయటపడ్డ చైనాను ఈ సరికొత్త వేరియంట్ వణికిస్తోంది. దాదాపు రెండేళ్ళ తర్వాత తొలిసారిగా ఈనెల 15న చైనాలో అత్యధికంగా 5280 కేసులు నమోదుకావడంతో అందరూ హడలిపోతున్నారు. రెండేళ్ళకుపైగానే కరోనాను కట్టడి చేస్తున్న చైనాకు ఇది పెద్ద సమస్యగా తయారైంది. కరోనా కేసులు పెరిగిపోతుండడంతో చైనాలో 13 పెద్ద నగరాల్లో సైతం రాకపోకలు లేకుండా ఆంక్షలు విధించారు. లాక్‌డౌన్ విధించారు. కోట్లాదిమంది ప్రజలను ఇళ్ళ నుంచి బయటకు రాని వ్వడం లేదు. ఇప్పట్లో లాక్‌డౌన్ ఎత్తివేసే పరిస్థితి కూడా కనిపించడం లేదంటే ఈ వేరియంట్ ప్రభావం ఎంతగా ఉందో తేటతెల్లమవుతోంది. ఒక్క చైనాలోనే కాదు కోవిడ్‌ను అదుపు చేయడంలో తనకు తానే సాటి అనిపించుకున్న దక్షిణ కొరియాకు కూడా కరోనా స్టెల్త్ ఒమిక్రాన్ సవాల్ విసురుతోంది. ఒక్క సారిగా ఈ సరికొత్త కరోనా కేసులు లక్షల సంఖ్యలోకి వెళ్ళిపోవడంతో ఆ దేశం అయోమయంలో పడింది. ఈ వ్యాధితో మరణాల సంఖ్య కూడా వందల్లోనే ఉంటుండడంతో మరింత కలవరం ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి రెండవ వారం నుంచి కరోనా వీరంగం కొంత తగ్గింది. మళ్లీ మార్చి మొదటి వారం నుంచి ఈ మహమ్మారి వ్యాధి కంటికి కనిపించకుండానే మానవాళిని ముప్పుతిప్పలు పెడుతోంది. ఇప్పటికే కరోనా ప్రపంచవ్యాప్తంగా పంజా విసురుతూ కోట్లాది మందికి నరకం చూపిస్తూనే ఉంది. కరోనా ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటిదాకా ప్రపంచంలో ఈ వ్యాధి బాధితుల సంఖ్య 45 కోట్లకు దాటిపోవడం, 60 లక్షలా 67వేల మందికి పైగానే ఈ వ్యాధితో ప్రాణాలు కోల్పోవడం జరిగిందని గణాంకాలు చెప్తున్నాయి. అయినప్పటికీ ఈ వ్యాధి బారినపడిన దాదాపు 40 కోట్ల మంది దాకా బాధితులు వైద్యుల చికిత్సలతో కోలుకున్నారు కూడా. అమెరికా, బ్రెజిల్, ఫ్రాన్స్, యుకే, రష్యా, జర్మనీ, టర్కీ, ఇటలీ, స్పెయిన్ తదితర దేశాల్లో కరోనా ఇంకా విలయం సృష్టిస్తూ ఎంతో మందిని బలి తీసుకుంటూనే ఉంది. మనదేశంలోనూ కరోనా విధ్వంసం అంతా ఇంతా కాదు. కరోనా కేసుల సంఖ్య నాలుగుకోట్లకు దాటేశాయి. సుమారు 5 లక్షలా 15వేల మందికి పైగానే బాధితులను ఈ వ్యాధి పొట్టనపెట్టుకుంది. ముందస్తు జాగ్రత్తలు పాటించడం, టీకా వేసుకోవడం, ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు, చికిత్సలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి మనదేశంలో క్రమేణా అదుపులోకి వచ్చింది. రోజువారీ కేసులు పరిశీలిస్తే మనదేశంలో మళ్ళీ ఇప్పుడిప్పుడే కేసుల సంఖ్య కొద్దిగా పెరుగుతోండడం గమనార్హం. ఈనెల 15న ఒక్కరోజులోనే 2568 కొత్తకేసులు నమోదు కావడం, 97 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అయితే యాక్టివ్‌కేసుల సంఖ్య బాగా తగ్గింది. అనేక రాష్ట్రాల్లో కరోనా బాగా తగ్గడంతో ఆంక్షలు సడలించారు కూడా. ఏదేమైనప్పటికీ కరోనా ప్రాణాంతకవ్యాధి. అందులోనూ తగ్గినట్లే తగ్గి మళ్ళీ విజృంభించి ప్రాణాలు తీయడమన్నది దీని లక్షణమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. కంటికి కనిపించని ఒక సూక్ష్మక్రిమి ప్రపంచ వ్యాప్తంగా మానవాళిని గత రెండేళ్ళుగా పట్టి పీడిస్తూనే ఉంది. ఎందరో ప్రముఖులు, సామాన్య ప్రజలు ఈ వ్యాధికి బలైపోయారు. అన్నిదేశాల్లో అన్ని వ్యవస్థలు కుదేలైపోయాయి. ఆర్థికంగా అనేక దేశాలు చితికిపో యాయి. నిరంతరం మరణమృదంగం మోగుతూనే ఉండడం, కోట్ల సంఖ్యలో ప్రజలు కళ్ళముందే ప్రాణాలు కోల్పోతుండడం చూస్తుంటే.. చావు అన్నది ఇప్పుడు సర్వ సాధారణమైపోయింది. దీంతో అందరి లోనూ ఏదో తెలియని నిరాశ నిస్పృహలు ఆవరిస్తు న్నాయి. ఈ మాయదారి కరోనా ఎప్పుడు అంతమవు తుందోనని మానవాళి అంతా ఆశగా ఎదురు చూస్తోంది. ఇప్పటికీ శాస్త్ర వేత్తలు, ప్రభుత్వాలు ఈ కరోనా కోరల నుంచి కోట్లాది మందిని కాపాడుతూనే ఉన్నారు. కానీ పూర్తిస్థాయిలో ఆ వ్యాధి తగ్గడమే లేదు. అందుకే అన్ని స్థాయిల్లోనూ ప్రభుత్వాలు వైద్యరంగాన్ని, శాస్త్ర సాంకేతిక రంగాలను ఇంకా బలోపేతం చేయాలి. ప్రజల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు కూడా సత్వర పథకాలు ప్రవేశపెట్టాలి. ప్రజల ప్రాణాలకు ముప్పులేకుండా కాపాడాలి. ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ కరోనా రాకాసి పీడ వదిలించుకునేందుకు ముమ్మరంగా పోరు సాగించాలి. ప్రపంచమంతా ఒక్కటై పోరాడితే తప్ప ఈ వ్యాధి వదిలేలా కనిపించడం లేదు. అందరూ కలసి పోరాడాలి. మానవాళి మనుగడకే ముప్పుగా మారి ప్రజల ప్రాణాలు తీస్తున్న కరోనా సూక్ష్మ రాకాసిపై జరిగే యుద్ధంలో మానవుడే గెలవాలి. మానవుడే అజేయుడై నిలవాలి.

### మరో కొత్త అవతారం..'స్టెల్త్ ఒమిక్రాన్'



మాయలమారి కరోనా మళ్ళీ ప్రపంచాన్ని భయపెడుతోంది. ఇప్పుడిప్పుడే కాస్తంత తగ్గు తోందిలే అనుకుని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో 'తగ్గేదే లే'..అంటూ మానవాళిని బెంబేలెత్తిస్తోంది. ఇప్పటికే పలు రకాల వేరియంట్‌లు (రూపాలు)తో, కంటికి కనిపించకుండానే మారణహోమం సృష్టిస్తున్న ఆ సూక్ష్మక్రిమి తాజాగా 'స్టెల్త్ ఒమిక్రాన్ వేరియంట్' అనే రూపంతో ప్రపంచానికి దడ పుట్టిస్తోంది. ఇది ఒమిక్రాన్ కంటే వేగంగా వ్యాపిస్తుందని, దీని తీవ్రత ప్రమాదకరంగా ఉం టుందని కూడా అంటున్నారు. ఇప్పటికే చైనా, దక్షిణ కొరియా దేశాల్లో ఈ వేరియంట్ భయంకరంగా విజృంభిస్తోంది. దీంతో నాలుగో దశ కరోనా ముప్పు ముంచుకొచ్చే ప్రమాదం ఉందని, కనుక దీనిపట్ల కూడా ప్రతిఒక్కరూ ఎంతో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సోమిరెడ్డికి మత్స్యకార నాయకుల కృతజ్ఞతలు



సర్వేపల్లి నియోజకవర్గం టిడిపి మత్స్యకార కమిటీ విభాగం అధ్యక్షునిగా ముత్తుకూరుకు చెందిన అక్కయ్యగారి ఏడుకొండలు ఇటీవల పదవిని పొందిన నేపథ్యంలో మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మత్స్యకార విభాగం నాయకులు ఈనెల 14న సన్మానించారు. తనకు ఆ పదవి వచ్చేందుకు కృషిచేసిన సోమిరెడ్డికి ఏడుకొండలు తన కృతజ్ఞతలు తెలిపాడు. మత్స్యకార నాయకులు ఎల్లంగారి రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెయ్యిరోజుల జగన్ పాలన అంతా అస్తవ్యస్థం

### ధ్వజమెత్తిన టిడిపి నేత అబ్దుల్ అజీజ్



ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వెయ్యి రోజుల పాలనంతా అస్తవ్యస్తమని, పరిపాలన మొత్తం పాపాలమయంగా మారిందని టిడిపి జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ధ్వజమెత్తారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ప్రజలకు మాయమాటలు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు మరచిపోయారని, విద్యుత్‌చార్జీలు పెంచేదిలేదని అప్పుడు చెప్పి ఇప్పుడు భారీగా చార్జీలు పెంచి పేదలపై భారం మోపారని విమర్శించారు. టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పొత్తూరి శైలజ, విజేత, పద్మ, కప్పిర శ్రీనివాసులు, మైనుద్దీన్, సురేంద్రబాబు, శ్రీనివాసులునాయుడు, జలదంకి సుధాకర్, సాబిర్‌ఖాన్, పెంచలనాయుడు, సాయిబాబా, కనపర్తి గంగాధర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల పేరుతో వెన్ను విరుస్తున్నారు




గతవారం మన 'లాయర్' పత్రికలో 'నగరం కాదు నరకం' అంటూ ప్రచురించిన వార్త చాలా బాగుంది. ప్రజలకు వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైన కార్పొరేషన్, పన్నుల వసూళ్ళలో మాత్రం తమ ప్రతాపం చూపిస్తోంది. తాజాగా టాక్సుల స్లాబులను మార్చి వీలయిన మేరకు ప్రజల వద్ద డబ్బులు గుంజడానికి చూస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారస్తులపైన అధికారులు తమ ప్రతాపం చూపిస్తున్నారు. ఏదో ఒక విధంగా ప్రభుత్వ ఆదాయం పెంచే పనిలో కుంటి సాకులు చూపించి పన్నులు వసూలు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో షాపు బయట చిన్న వస్తువు కనిపించినా, దానికి కూడా వందా రెండొందలు జరిమానా వేసి దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారు. నగర కార్పొరేషన్ చేతకానితనాన్ని మన 'లాయర్'లో చక్కగా వివరించారు. యువ కమిషనర్ వచ్చాకైనా అక్రమ కట్టడాలు ఆగిపోతాయనుకున్నాము. ఆయన కూడా అందరిలాంటివాడే అని రుజువు చేసుకున్నాడు. ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపించి జరిమానాలు విధిస్తే ఇప్పుడు వీళ్ళు బలవంతంగా వసూలు చేస్తున్న చిల్లర కంటే వందల రెట్లు ఎక్కువ మొత్తం వసూలవుతుంది. ఇలా వ్యాపారస్తులను, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. ఇప్పటికైనా కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు కూడా కళ్ళుతెరుచుకుని ప్రజలని, వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టడం మానేయాలి. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అరాచకాలతో పాటు, నగర వాస్తవ పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా వివరించిన మన 'లాయర్' పత్రికకు అభినందనలు.

**పి. నరసింహులుగుప్తా, నెల్లూరు.**

## బహిరంగ ధూమపానాన్ని అడ్డుకోలేరా?

"సరదా సరదా సిగరెట్టూ ఇది దొరల్ తాగు బల్ సిగరెట్టూ.. పట్టుబట్టి ఒక దమ్ము లాగితే స్వర్గానికి యిది తొలి మెట్టు" అన్నది ఒక సినీ కవి రాసిన పాట. "పొగ తాగేవాడి పక్కన నిల్చున్నా అనారోగ్యం పాలై అల్పాయుష్షుతోనే నరకానికి పోక తప్పదని" నేటి వైద్యులు చెప్తున్న మాట. టీవీలు పెట్టినా, సినిమాకు వెళ్లినా ఎక్కడ చూసినా 'ధూమపానం ఆరోగ్యానికి హానికరం' అన్న బోర్డులు ప్రధానంగా కనపడుతున్నాయి. కానీ ప్రభుత్వాలు మాత్రం బహిరంగ ధూమపానాన్ని అడ్డుకోలేక పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరాలలో కూడా పొగరాయుళ్లు బహిరంగ ప్రదేశాల్లోనే దర్జాగా దమ్ము కొట్టేస్తున్నారు. నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో కాఫీ షాపులు, టీ దుకాణాలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రతిచోటా ధూమపాన ప్రియుల సంఖ్య కూడా రోజురోజుకీ అంతకంతగా పెరిగిపోతోంది. ఈ విషయంలో కోర్టులు పలుమార్లు అక్షింతలు వేశాయి. ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. ప్రజలు తిరిగే ప్రాంతాలలో పొగత్రాగితే జరిమానాలు విధించాలని కూడా ఆదేశించాయి. కానీ ఫలితం మాత్రం శూన్యం. రెండు పదులైనా నిండని యువత కూడా గుంపులు గుంపులుగా చేరి ధూమపానం చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. పోలీసు శాఖకు కూడా బహిరంగ ధూమపాన నిషేధంలో పూర్తి బాధ్యత ఉంది. అయితే ఆ శాఖవారే యూనిఫారం వేసుకుని మరీ సిగరెట్లు కాల్చేస్తుంటే ఇక సామాన్యులకు భయమెక్కడుంటుంది....? సిగరెట్టు త్రాగే వారితో సమానంగా ఆ పొగ పీల్చేవారి ఆరోగ్యం కూడా నాశనమైపోతుందని అనేక సర్వేలు రుజువు చేస్తున్నాయి. కానీ ధూమపాన ప్రియులు మాత్రం మారడం లేదు. పోలీసుశాఖ చొరవ చూపించి బస్‌స్టాండులలో, టీ కాంటీన్లలో, కాఫీ షాపులలో బహిరంగ ధూమపానాన్ని అరికట్టాలి. చట్టవ్యతిరేకంగా బహిరంగ ప్రదేశాలలో పొగత్రాగేవారికి భారీ జరిమానా విధించి వారిని నియంత్రించాలి. అప్పటికి గానీ వారిలో మార్పురాదు!

**ఆర్. పి. రామయ్య, కొండాయపాలెం.**

# విజయవంతంగా ఇద్దరికి కిడ్నీ మార్పిడి

## నెల్లూరు అపోలో వైద్యుల ప్రతిభ



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ తన ఖాతాలో మరో అరుదైన ఘనతను నమోదు చేసుకుంది. ఒకే రోజు ఇద్దరు రోగులకు కేడావర్ ద్వారా కిడ్నీలను విజయవంతంగా మార్చి అపోలో వైద్యులు రికార్డు సృష్టించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏ.కె చక్రవర్తి, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ సనీల్‌రెడ్డి, అపోలో ఆసుపత్రి యూరాలజి విభాగాధిపతి డాక్టర్ నిశ్చల్‌ప్రసాద్‌రెడ్డిలు ఈనెల 14న నగరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ విషయం తెలిపారు. అనంతపురంలోని సవేరా కిమ్స్ హాస్పిటల్ లో ఓ మహిళకు ఇటీవల యాక్సిడెంట్ కావడంతో చికిత్సనిమిత్తం వచ్చిందని, అయితే ఆ మహిళ బ్రెయిన్ డెడ్ కావడంతో, ఆమె బంధువులు అవయవదానానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఆ విషయాన్ని జీవన్‌దాన్ ట్రస్ట్‌కు తెలియజేశారని, అప్పటికే అవయవాలు కావాలని నమోదు చేసుకుని అపోలో హాస్పిటల్లో చికిత్స పొందుతున్న పేషెంట్‌లకు జీవన్‌దాన్ నిర్వాహకులు సమాచారం ఇచ్చారని తెలిపారు. దీంతో నెఫ్రాలజీ డాక్టర్ ఏ.కె చక్రవర్తి, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ సనీల్‌రెడ్డి, యూరాలజి డాక్టర్ నిశ్చల్ ప్రసాద్‌రెడ్డిల బృందం, అర్ధరాత్రి హుటాహుటిన అనంతపూర్‌కు బయలుదేరి వెళ్లిన అపోలో వైద్యుల బృందం, బ్రెయిన్ డెడ్ అయిన ఆ మహిళ నుంచి రెండు కిడ్నీలు సేకరించి, వాటిని అనంతపూర్ నుంచి నెల్లూరు అపోలోకి తరలించేందుకు, పోలీసుల సహకారం కోరగా, శరవేగంగా స్పందించిన సీఎం ఆఫీస్ ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పరమేశ్వర్‌రెడ్డి, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అప్పటికే డయాలసిస్ చేయించుకుంటూ, కిడ్నీలు అవసరమైన ఇద్దరు రోగులకు వైద్యుల బృందం, గంటల వ్యవధిలోనే ఆపరేషన్ చేసి, విజయవంతంగా కిడ్నీల మార్పిడి చేశారని వెల్లడించారు. కిడ్నీలు అమర్చుకున్న వారిద్దరు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని స్పష్టం చేశారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఒకేసారి ఇద్దరికి కేడావర్ ద్వారా కిడ్నిలను శస్త్రచికిత్స చేసి మార్పిడి చేయడం ఇదే తొలిసారని, ఇదో రికార్డని చెప్పారు. అందుకు సహకరించినవారందరికీ ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు.

# 'వాత్సల్య'లో మరో ఆణిముత్యం

## - టిసిఎస్‌లో ఉద్యోగం సాధించిన విద్యార్థిని



డి.రమాదేవి

**అందరూ ఉండి, అన్నీ ఉండి చదువుమీద శ్రద్ధ లేకుండా తిరుగుతున్న విద్యార్థులెందరో ఉన్న నేటి సమాజంలో తల్లితండ్రులు కానీ, బంధువులు కానీ ఎవరూ లేని ఒక అనాథ విద్యార్థిని చదువునే నమ్ముకుని, జీవితంలో అన్ని కష్టాలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజయం సాధించింది. చదువుకు పేద గొప్ప తారతమ్యాలుండవు. క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకుంటే సమాజంలో ఎవరైనాసరే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మరోసారి ఆ విద్యార్థిని రుజువు చేసింది.**

అందులోనూ ఆ అమ్మాయి నెల్లూరులోని జనహిత-వాత్సల్య నిరాధార బాలల శరణాలయం విద్యార్థిని కావడం విశేషం. పేరు డి.రమాదేవి. మూడేళ్ళ పసివయసులోనే ఆ చిన్నారిని ఎవరో ఈ అనాధ శరణాలయం మెట్లవద్ద విడిచిపెట్టి వెళ్ళిపోయారు. తల్లితండ్రులెవరో కూడా ఆ పసిబిడ్డకు తెలియదు. ఆనాటి నుంచి వాత్సల్య సంస్థ వారు ఆ పాపను కన్నబిడ్డలా కంటికి రెప్పలా చూసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పించారు. దీంతో చిన్నతనం నుంచే ఆ బాలిక బాగా చదువుకుంటూ మంచి మార్కులు సాధిస్తూ వచ్చింది. ప్రతి తరగతిలోనూ కనీసం 80 శాతం మార్కులకు తగ్గకుండా రాణించింది. తనకంటూ ఎవరూ లేని నిరాధార బాలిక అయినప్పటికీ వాత్సల్య శరణాలయం వారి ప్రోత్సాహంతో హైదరాబాద్‌లో కూడా శిక్షణ తీసుకుని ఎంతో కష్టపడి చదువుకుని బిటెక్ పాసైంది. ఇప్పుడు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. తమ విద్యార్థిని రమాదేవికి టిసిఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, అసిస్టెంట్ సిస్టమ్ ఇంజనీర్‌గా ఆమె ఉద్యోగంలో చేరుతోందని వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ జివి సాంబశివరావు తెలిపారు. వాత్సల్యలో అలాంటి అనాధ బాలలు ఇప్పుడు 84 మంది ఉన్నారని, వారందరికీ దాతల సహకారంతో చదువులు చెప్పిస్తున్నామని, అందరి దయవల్లా పిల్లలంతా బాగా చదువుకుంటున్నారని ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఆరునెలల్లోనే ముగ్గురు వాత్సల్య విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందడం తమకెంతో గర్వకారణమన్నారు.

# అరుదైన వ్యాధుల చికిత్సకు బడ్జెట్ గ్రాంట్ పెంచండి

## - రాజ్యసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



భారతదేశంలో అరుదైన వ్యాధులకు బడ్జెట్ గ్రాంట్ పెంచాలని ఈనెల 14న రాజ్యసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. అరుదైన వ్యాధుల కోసం జాతీయ విధానం 2021, అరుదైన వ్యాధుల చికిత్సకు అధిక వ్యయాన్ని తగ్గించే లక్ష్యంతో రూపొందించబడిందని, దేశంలో 450కి పైగా అరుదైన వ్యాధులను గుర్తించినప్పటికీ, 50శాతం కంటే తక్కువ చికిత్స చేయదగినవి మరియు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదించిన చికిత్స ప్రస్తుతం 12-15 మందికి మాత్రమే అందుబాటులో ఉందని ఆయన అన్నారు. ఈ వ్యాధులపై చేసే ఆరోగ్య చికిత్సల వ్యయం చాలా ఎక్కువగా ఉంటుందని, చివరికి ఇది రోగుల కుటుంబాలకు తీవ్ర నష్టం చేస్తుందన్నారు. ఈ విధానం వ్యక్తులు మరియు కార్పొరేట్ దాతల నుండి సహకారాన్ని కోరుతూ స్వచ్ఛందంగా క్రౌడ్ ఫండింగ్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను సృష్టించిందన్నారు. ఇప్పటి వరకు కేవలం రూ. 1,15,866 సేకరించడం లేదా కేటాయించడం జరిగాయని, చికిత్స చేయగల పరిస్థితులతో 237 మంది రోగులు క్రౌడ్ ఫండింగ్ ద్వారా మద్దతు కోసం వేచి ఉన్నారని పేర్కొన్నారు. గ్రూప్ 3(ఎ) వ్యాధులకు ఖచ్చితమైన చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, చికిత్సకు ప్రభుత్వ సహకారం లేకపోవడంతో దాదాపు 45 మంది రోగులు మధ్యంతరకాలంలో ప్రాణాలు కోల్పోయారని, కనుక ఈ పాలసీ కింద పెరిగిన బడ్జెట్ కేటాయింపుతో చికిత్స చేయగల రుగ్మతలు లేదా వ్యాధుల కోసం కేంద్రం ద్వారా స్థిరమైన చికిత్స మద్దతును అందించడానికి అవసరమైన మార్గదర్శకాలను జారీచేయాలని ఆయన కోరారు.

### బల్క్‌డ్రగ్ పార్క్‌లపై ప్రతిపాదనల వివరాలేమిటి?

ప్రమోషన్ ఆఫ్ బల్క్ డ్రగ్ పార్క్స్ పథకం కింద బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల నుంచి అందిన ప్రతిపాదనల వివరాలు, ఏర్పాటుచేయబోయే బల్క్ డ్రగ్ పార్క్‌ల సంఖ్య, బల్క్ డ్రగ్ పార్క్‌ని స్థాపించడానికి స్థలాలను గుర్తించడానికి అనుసరించే ప్రమాణాల వివరాలేమిటి?.. అందుకు సంబంధించి ఏదైనా రాష్ట్రం నుండి ప్రతిపాదన ప్రారంభించబడిందా, అలా అయితే, దాని వివరాలు తెలపాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 15న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ, "బల్క్ డ్రగ్ పార్కుల ప్రమోషన్" పథకం 3 బల్క్ డ్రగ్ పార్క్‌లకు సాధారణ మౌలిక సదుపాయాల కల్పన కోసం గ్రాంట్-ఇన్-ఎయిడ్ మద్దతును అందిస్తుందని తెలిపారు. ఫార్మాస్యూటికల్స్ విభాగం యొక్క వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఈ పథకం యొక్క వివరణాత్మక మార్గదర్శకాలలో ఎంపిక ప్రమాణాలు నిర్దేశించబడ్డాయని, ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌తో సహ 13 రాష్ట్రాల నుంచి ఫార్మాస్యూటికల్స్ శాఖ ప్రతిపాదనలు అందుకోవడం జరిగిందని సమాధానమిచ్చారు.

# అన్నం పెట్టే రైతుకు అన్యాయం చేస్తున్నారు

## చెప్పేదొకటి.. ఇచ్చే ధర మరొకటి - మాజీమంత్రి సోమిరెడ్డి



ధాన్యానికి పుట్టికి మద్దతు ధర 16,660 రూపాయలైతే రైతుకు దక్కుతున్నది మాత్రం కేవలం రూ. 12 వేల నుంచి రూ. 14వేల లోపేనని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. రైతన్నలకు ఇంత అన్యాయం జరుగుతుంటే జిల్లాలోని అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల ఆయన సూళ్లూరుపేట నియోజకవర్గంలో నెలవల సుబ్రహ్మణ్యం, వేనాటి సతీష్‌రెడ్డి, ముప్పాళ్ల విజేత తదితరులతో కలిసి పర్యటించి క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారి ఇక లాభం లేదనకుని రైతులు వచ్చినకాడికి ధాన్యం అమ్ముకుంటున్నారని అన్నారు. జిల్లావ్యాప్తంగా 6 లక్షలకు పైగా ఎకరాల్లో పంట దిగుబడి వస్తోందని, సగటున నాలుగు పుట్లు వేసుకుంటే 25 లక్షల పుట్ల వరకు దిగుబడి రానుందని, అయితే దళారులు, వైసీపీ నాయకులు కలిసి చేస్తున్న దోపిడీ కారణంగా ఈ సీజన్‌లోనూ రైతులు వెయ్యికోట్లకుపైగా నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. ఆర్బీకేల్లోనూ తేమ పేరుతో 75 కిలోల బస్తాకు 15 నుంచి 20 కిలోలు అదనంగా దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు ఇబ్బందులు వస్తే మీలా మేము చూస్తూ ఊరుకోలేదన్నారు. బీపీటీలో వచ్చిన విరుగళ్ల కారణంగా రైతులు నష్టపోకుండా బోనస్ అందించామని, నెల్లూరు జిలకర రకం ధాన్యం ధరల విషయంలో వచ్చిన గ్రేడ్ సమస్యను పరిష్కరించి రైతులకు నష్టం లేకుండా చేశామని చెప్పారు. 2016లో ధాన్యం దిగుబడులు వెల్లువెత్తి ధరలు తగ్గడంతో దేశంలో ఎక్కడైనా అమ్ముకునే అవకాశం కల్పించామన్నారు. అయితే ఇప్పుడు రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం రైతులను, వారి ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేసిందని, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలయ్యే పథకాలను కూడా పక్కన పెట్టేశారని ఆయన విమర్శించారు. ఆర్బీకేల్లో అతికించిన పోస్టర్లలోని అంశాలకు, వాస్తవ పరిస్థితులకు పొంతనే కుదరడం లేదని, రైతులకు అందుబాటులో ఉండాల్సిన ఆర్బీకేలు అనేక చోట్ల మూతపడి కనిపిస్తున్నాయని ఆయన అన్నారు.







# కోవిడ్ నాలుగో వేవ్ రావొచ్చు..
# జాగ్రత్తగా ఉండాలి
## - కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు



చైనాలో మళ్ళీ కోవిడ్ రావడంతో లాక్‌డౌన్ విధించారని, మనదేశంలో కూడా కరోనా నాలుగో దశ రావొచ్చని, కనుక అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ముందస్తుగా హెచ్చరించారు. ఈనెల 14న ఆయన కలెక్టరేట్‌లో క్షయవ్యాధి నివారణకు సంబంధించిన అధికారులతో సమావేశమయ్యారు. కరోనా నాలుగోదశ మే-జూన్ నెలల్లో వచ్చే అవకాశం ఉందని, అధికారులు ప్రజలు అందరూ చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. నాలుగోదశ కోవిడ్‌ను కూడా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 4575 క్షయవ్యాధి కేసులు ఉన్నాయని, క్షయ అంటువ్యాధి కనుక దీని నియంత్రణపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టి ఆ వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. జేసీలు హరేందిర ప్రసాద్, జాహ్నవి, డిఆర్‌ఓ చిన్నఓబులేసు, డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, జడ్పీసిఇఓ శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, డిఇఓ రమేష్, క్షయ నియంత్రణ అధికారి జి.వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరకే ధాన్యం కొనాలి



## - జేసీ హరేందిరప్రసాద్

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల వద్దనుండి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులను, రైస్ ట్రేడర్స్‌ను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఆయన పౌరసరఫరాల శాఖ అధికారులు, ట్రేడర్స్‌తో సమావేశమై ధాన్యం కొనుగోళ్ళపై సమీక్షించారు. కొంతమంది దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన రేట్లకు విక్రయిస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆ విషయంపై పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేకదృష్టి సారించి, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైస్‌ట్రేడర్స్ కూడా రైతుల వద్ద కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ డి.ఎం.పద్మ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో.. నెల్లూరు ఫస్ట్



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. తిరుపతిలోని ఎస్‌వియు స్టేడియంలో ఇటీవల మూడురోజుల పాటు నిర్వహించిన ఏపీ స్టేట్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచారు. మొత్తం 13 జట్లు పాల్గొంటే ఫైనల్స్‌లో చిత్తూరు జట్టుతో తలపడి 1-0 గోల్స్ తేడాతో నెల్లూరు జట్టు ప్రథమ స్థానాన్ని సాధించింది. డైనమోస్ ఫుట్‌బాల్ అసోసియేషన్-రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. విజేతలకు తుడా వీసీ హరికృష్ణ ట్రోఫీ అందజేయగా, నిర్వాహకులు వారికి నగదు బహుమతులు అందజేశారు. డైనమోస్ అధ్యక్షుడు ఎంఆర్ రాజా, సభ్యుడు సుధాకర్, చీఫ్ కోచ్ బాలాజీ, ఫుట్‌బాల్ కోచ్ వినోద్ పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# మోసగాళ్ళ ఆట కట్టించండి
## పోలీసులకు ఎస్పీ ఆదేశం

ఉద్యోగాలిస్తామని, చీటీలు కడితే ఎక్కువ డబ్బులిస్తామని చెప్పి అమాయక ప్రజలను బురిడీ కొట్టించే మోసగాళ్ళ ఆట కట్టించాలని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. 92 మంది బాధితుల నుంచి అర్జీలను



స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మోసగాళ్ళను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దన్నారు. దేవిధంగా మిస్సింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని, దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేకపోలీసు బృందాలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. తల్లితండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లలకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, ప్రవర్తన మార్చుకోని వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. భార్యాభర్తల గొడవల విషయంలో తొందరపడి కేసులు కట్టకుండా కౌన్సిలింగ్ ఇచ్చి సాధ్యమైనంత వరకు వారి కాపురాలు చక్కదిద్దేలా చూడాలన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులకు సంబంధించి వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి వెంటనే న్యాయం జరిగేలా చేయాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమానికి వచ్చి అర్జీలిచ్చిన ప్రజలకు భోజనవసతి కల్పించారు. ఏఎస్పీ వెంకటరత్నం, డిఎస్పీలు హరనాథరెడ్డి, కోటారెడ్డి పాల్గొన్నారు.

## వీఎస్‌యులో ఎన్‌ఎస్‌ఎస్
# జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికలు



బెంగళూరులో ఈనెల16 నుంచి 22వ తేది వరకు ఏడు రోజుల పాటు జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల ఆన్‌లైన్‌లో ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని ఎన్ఎస్ఎస్ విభాగాలున్న కాలేజీల నుంచి అనేకమంది వాలంటీర్లు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.యం.సుందరవల్లి ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహణ కోసం త్రిసభ్య ఎంపిక కమిటీని నియమించడం జరిగిందని సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అల్లం తెలిపారు. వాలంటీర్ల సాంస్కృతిక మరియు సమాచార నైపుణ్యంతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అయిదుగురు విద్యార్థులను, మరియు అయిదుగురు విద్యార్థినులను సమైక్యతా శిబిరానికి పంపుతున్నామని ఆయన పేర్కొన్నారు. డా. కె.సునీత, డా ఏ.మహేంద్రరెడ్డితో పాటు డా. ఏ.ఉదయ్ శంకర్ అల్లం త్రిసభ్య కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. వివిఎస్‌యు నుంచి జాతీయ సమైక్యతా శిబిరానికి 10మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు, ఒక ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారికి అవకాశం రావడం సంతోషదాయకమని వివిఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# ఎన్జీఓల నేతగా జిఆర్ విక్రమ్



ఆంధ్రప్రదేశ్ ఎన్జీఓల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నెల్లూరులో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న జిఆర్ విక్రమ్ ఎంపికయ్యారు. విజయవాడలో ఇటీవల జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన ఎన్నిక కావడంతో నెల్లూరు ఐసిడిఎస్ ఉద్యోగులు ఆయన్ను ఈనెల14న ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. డిసిపిఓ సురేష్, ఏఓ శర్మిష్ట, ఎలిజబెత్, లక్ష్మీదేవితో పాటు ఐసిడిఎస్ సిబ్బంది సమత, జ్యోతి, జ్యోత్స్న పాల్గొన్నారు.

# అమరజీవి ఆదర్శప్రాయులు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కె.వి.చలమయ్య తదితరులు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు నేటి తరానికి ఆదర్శప్రాయులని అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఉపాధ్యక్షులు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు కెవి చలమయ్య అన్నారు. ఈ నెల 16న శ్రీ పొట్టి శ్రీరాములు 121వ జయంతి సందర్భంగా అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ సాధన కోసం శ్రీ పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాశారని, ఆయన త్యాగం ఏనాటికీ మరువలేనిదని అన్నారు. అమరజీవికి భారతరత్న ప్రకటించాలని, అమరావతిలో మహాత్మాగాంధీ స్మృతివనం వద్ద శ్రీ పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుచేయాలని, అసెంబ్లీలోనూ, పార్లమెంట్‌హాలులోను అమరజీవి చిత్రపటాలను పెట్టాలని, వాటి ప్రాంగణాల్లో అమరజీవి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆర్యవైశ్య ప్రముఖులు నగరకంటి రవీంద్ర, ఎస్.నాగేశ్వరరావు, ఆర్‌వి శరత్, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు రామకృష్ణ, ఆర్.శేషగిరి, అవోపా సభ్యులు దగుమాటి మురళీకృష్ణ, అనుమాలశెట్టి నరసింహం, దగుమాటి జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయన త్యాగం చిరస్మరణీయం



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమైనదని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు అన్నారు. ఈనెల 16న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 121వ జయంతి సందర్భంగా నెల్లూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాన్ని ఆయన కొనియాడారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంపి ఆంజనేయులు, కోశాధికారి కె.శోభన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ కె. మోహన్‌రావు, సహాయ కార్యదర్శి ఏవి ఫణి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మొల్లమ్మ పుట్టింది..
# మన గోపవరంలోనే



మహాకవయిత్రి మొల్లమ్మ పుట్టింది నెల్లూరు జిల్లా కలువాయి మండలంలోని గోపవరం గ్రామంలో నేనని, అందులో ఎలాంటి సందేహాలకు తావులేదని, అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తమవద్ద ఉన్నాయని మొల్ల సాహిత్య ప్రచారసమితి అధ్యక్షుడు డా.శివశంకర్ స్పష్టం చేశారు. ఈనెల 13న నెల్లూరు అంబాపురంలోని ఎస్‌ఎన్‌బి కల్యాణమండపంలో జిల్లా శాలి వాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమ్మ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగులో 'మొల్ల రామాయణం'గా ప్రసిద్ధిగాంచిన రామాయణాన్ని ఆమె సులభశైలిలో రచించి ఖ్యాతిగాంచారని, ఆమె తన రచనలో పేర్కొన్న శ్రీకంఠమల్లేశ్వరుని ఆలయం, నాటి మహారాజులు ఆమెకు బహూకరించిన పొలం, ఆమె నివసించిన గృహం తదితర ఆనవాళ్లు నేటికీ గోపవరంలో ఉన్నాయన్నారు. తొలుత మొల్లమ్మ చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాలివాహన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిస్ నరసయ్యతో పాటు ఎంపిటిసి సుమతి, ఆ సంఘం నాయకులు పెళ్ళూరు శ్రీనివాసులు, తొలిగుండ వెంకటేశ్వర్లు, మొల్ల సాహిత్య ప్రచారసమితి గౌరవాధ్యక్షుడు బిపి నరసారెడ్డి తదితరులు ప్రసంగించారు. సాహితీవేత్తలు ఆలూరు శిరోమణిశర్మ, గుండాల నరేంద్రబాబు, తోట సులోచన, బొగ్గరపు ఇందిరాకృష్ణ, ములుగు లక్ష్మీమైథిలి, రాధశ్రీ, మంజుప్ప, నాగరత్నమ్మ, కె.శ్రీనివాస్, కె.వెంకట రమణలను ఈ సందర్భంగా సన్మానించారు.



# ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తీర్చండి

## - వ్యవసాయమంత్రికి నెల్లూరుజిల్లా ఎమ్మెల్యేల వినతి

జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్ సాగు చివరిదశలో ఉందని, జిల్లా అంతటా వరికోతలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఉన్న సమస్యలను తీర్చాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబును, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలసి జిల్లా ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు కోరారు. ఈనెల 15న వారు విజయవాడలో మంత్రులిద్దరినీ కలిసి రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన మంత్రి కన్నబాబు ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, రైతులు పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేల వెంట డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డిఎఎబి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

# కోవూరు బడులకి 18.52 కోట్లు

కోవూరు నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు రెండోవిడత కింద 18.52 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరుచేసిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరులో 5 పాఠశాలలకు 4.53 కోట్లు, కొడవలూరులో 4 పాఠశాలలకు 2.58 కోట్లు, బుచ్చిలో 3 పాఠశాలలకు 3.45కోట్లు, ఇందుకూరుపేటలో 4 పాఠశాలలకు 2.89కోట్లు, విడవలూరులో 5 పాఠశాలలకు 5.07 కోట్లు వంతున మంజూరయ్యాయని అంటూ నిధులిచ్చి బడుల బాగుకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# సూర్యప్రభ వాహనంపై రంగనాథస్వామి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెల్లూరు, రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15న స్వామివారిని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి మంగళవాద్యాలు, వేదనాదాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఇలపాక శివకుమార్ ఆచారి, ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తలమండలి సభ్యులు ఈ వేడుకను పర్యవేక్షించారు.

# సకల జనరంజకంగా.. సీఎం జగన్ పాలన

## వైకాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఎన్నో సవాళ్ళను అధిగమించి, సంపూర్ణ ప్రజాబలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అధికారంలోకి వచ్చాక, కేవలం రెండున్నరేళ్లలోనే ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన దాదాపు అన్ని హామీలు అమలు చేయడమే కాక, చెప్పని హామీలతోపాటు, అనేక సంక్షేమ కార్యక్రమాల అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సకలజనరంజకంగా పరిపాలన సాగిస్తున్నారని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ములుమూడి గ్రామంలో ఆమె డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలసి ఈనెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుమూడి గ్రామంలో పార్టీ జెండాను తాను ఆవిష్కరించడం తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఇటీవల ములుమూడి గ్రామం వచ్చినప్పుడు గిరిజనులకు చాలమందికి ఆదార్ కార్డులు లేవని తెలిసిందని, తాను అధికారులకు ఈ విషయం తెలుపగా.. వారు వెంటనే స్పందించి, ఈ గ్రామ గిరిజనులకు ఊరిలోనే శిబిరం ఏర్పాటుచేసి ఆధార్ కార్డులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని, పెద్ద పదవులను కూడా మహిళలకు కేటాయించడం జరిగిందని ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజల కోసం సిఎం రాజీ లేని పోరాటం చేస్తున్నారని, భవిష్యత్తులో కూడా రాష్ట్రం అభివృద్ధిపథంలో నడవాలన్నా, ప్రజలకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందాలన్నా తిరిగి మన ప్రభుత్వమే అధికారంలోకి రావాలని, ఆ దిశగా ప్రతిఒక్కరు పార్టీ పటిష్టతకు పాటుపడాలని... 2024లో మళ్ళీ వైకాపా విజయ పరంపర కొనసాగేలా ముందుకు వెళదామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.



వైకాపా జిల్లా కార్యదర్శి చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి హంస కుమార్‌రెడ్డి, మాజీ రూరల్ మండల కన్వీనర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, దొడ్ల మస్తానయ్య యాదవ్, ఖాదర్ బాషా, పొట్టేపాళెం మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, బాబురావు, జయరామిరెడ్డి, వైకాపా కార్యకర్తలు, ములుమూడి గ్రామ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనడం జరిగింది. తొలుత ఆనం అరుణమ్మను, విజయకుమార్‌రెడ్డిని గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

# చేనేతలకు అండగా ప్రభుత్వం

## - వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



వెంకటగిరి ప్రాంతంలో ఉన్న చేనేతకారుల అభ్యున్నతికి త్వరలోనే రెండుకోట్ల రూపాయల నిధులు విడుదల కానున్నాయని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. స్థానిక పద్మశాలి కల్యాణమండపంలో ఈనెల 13న జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కేంద్రప్రభుత్వం విడుదల చేసిన చేనేత యాప్‌ను ప్రారంభించారు. ప్రపంచంలో ఎక్కడున్నా ఇందులో ఉన్న చేనేతచీరల వివరాలు పరిశీలించి కొనుగోలు చేసేందుకు చేనేత యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా చేనేతచీరలు నేసినవారు ఈ యాప్ ద్వారా తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. యాప్‌ను ఏవిధంగా ఉపయోగించుకోవాలో ఈ సందర్భంగా చేనేతకారులకు అవగాహన కలిగించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భానుప్రియ, రాష్ట్ర పద్మశాలి సంఘం డైరెక్టర్ వెంకటేశ్వరరావు, చెన్నై టెక్స్‌టైల్స్ సహాయ సంచాలకులు పూర్ణిమ, క్వాలిటీ అధికారి పొన్నుస్వామి, వసంత్‌కుమార్, విశ్రాంత జేడీ పట్టురాజన్, ఏ.డి ఆనంద్, పుర ఉపాధ్యక్షులు బాలయ్య, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# 70 ఏళ్ళ వయసులో ఆడుతూ పాడుతూ..

## ఆనందానుభూతిని పొందిన వీఆర్ కాలేజీ పూర్వ విద్యార్థులు

వారందరి వయస్సు 7 పదులు దాటింది. 1966 నుండి 1969 వరకు వి.ఆర్ కాలేజీలో చదివి బీఎస్సీ పట్టా పుచ్చుకున్నారు. అప్పట్లో 70 మంది ఆ బ్యాచ్‌లో ఉండేవాళ్ళు. చదువులు పూర్తయ్యాక రెక్కలొచ్చిన పక్షుల్లా తలా ఒక దిక్కుకి ఎగిరిపోయారు. తమ తమ వ్యాపారాలతో వ్యాపకాలతో బిజీ అయిపోయారు. ఇప్పుడు 53 ఏళ్ళ తరువాత వాళ్ళలో 20 మందిని ఒక చోటకు చేర్చారు వారి సహాధ్యాయి ప్రముఖ న్యాయవాది నాగారెడ్డి శ్రీనివాసులరెడ్డి. 50 సంవత్సరాల క్రితం తనతో పాటు చదువుకున్న విద్యార్థుల చిరునామాలు, ఫోన్ నెంబర్లు అతి కష్టం మీద సేకరించారు శీనయ్య. 1966 - 69 వీఆర్సి బీఎస్సీ(ఎంపిసీ) పేరుతో ఒక వాట్స్‌ఆప్ గ్రూపుని క్రియేట్ చేశారు. అందరిని ఒకే చోటకు చేర్చి పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని 2 సంవత్సరాల క్రితమే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే కరోనా కారణంగా ఆయన కోరిక తీరడానికి కొంత ఆలస్యమయింది. మొత్తానికి మార్చి 11, 12, 13 తేదీలలో పాత మిత్రులను 20 మందిని ఒక చోటకు చేర్చగలిగారు. వీరిలో 15 మందికిపైగా దేశంలోని పలు ప్రాంతాలలో స్థిరపడినవారు కాగా, మిగిలినవాళ్ళు నెల్లూరులోని వారే! ఒక్కసారిగా తమ పాత మిత్రులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. వీరంతా నగరంతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలలో ఉన్న పుణ్యక్షేత్రాలను దర్శించారు. అదానీ కృష్ణపట్నం పోర్టుని, తడలోని నిప్పో బ్యాటరీల తయారీ కర్మాగారాన్ని సందర్శించారు. ధనలక్ష్మీపురంలోని కేజీకే కళ్యాణ మండపానికి అనుబంధంగా ఉన్న కల్పన హోటల్లో 3రోజులు సందడి చేశారు. ఈ సందర్భంగా తమ గురువు మన్నెమాల కోదండరామిరెడ్డిని, ఆయన సతీమణి అరుణమ్మని సత్కరించుకున్నారు. తమ సహాధ్యాయి, వ్యాపారవేత్త చంద్రశేఖరరెడ్డి, ఆయన స్వగ్రామం మానమాలలో నిర్మించిన విఘ్నేశ్వర ఆలయాన్ని కూడా దర్శించి పూజలు చేశారు. తమ సహధర్మచారిణులతో సహా ఈ రీ-యూనియన్‌లో పాల్గొన్న కొంత మంది ఆనందంతో పొంగిపోయారు. ఇక, ఇలా ప్రతి ఏడాదీ అందరం కలుసుకుందాం అని నిర్ణయించుకున్నారు. తమ వయసును సైతం మర్చిపోయి కాలేజీ రోజులలో చేసిన అల్లరి, చూసిన సినిమాలు, కలిసి తిరిగిన నేస్తాల గురించి మాట్లాడుకుంటూ 53 సంవత్సరాలు వెనక్కు వెళ్లిపోయారు. గతించిన వారిని స్మరించుకున్నారు. తమనంతా ఒక చోటకు చేర్చి ఆత్మీయతతో, అనురాగంతో, ఆదరణతో, అపురూపంగా చూసుకున్న తమ మిత్రుడు శ్రీనివాసులరెడ్డిని, ఆయనకు సహకరించిన చంద్రశేఖరరెడ్డిని అభినందించారు. అందుకే అన్నారు 'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం'.



గురువు కోదండరామిరెడ్డి - అరుణమ్మ దంపతులను సత్కరిస్తూ...



కార్యక్రమ మూలకర్త, సంధానకర్త నాగారెడ్డి శీనయ్యను అభినందిస్తూ...



మానమాల విఘ్నేశ్వరాలయంలో...



తడలోని నిప్పో కర్మాగారంలో...



అదాని కృష్ణపట్నం పోర్టులో...

# గూడూరు డివిజన్ వార్తలు

## ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

### శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మెన్‌గా శ్రీకంటి



ఆలయ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

గూడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వి.వరప్రసాదరావు పాలకమండలి నూతన సభ్యులను కోరారు. ఈ నెల 12వ తేదీ ఆలయం వద్ద నూతన పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మెన్‌గా శ్రీకంటి రామ మోహనరావు, సభ్యులుగా హరికృష్ణ, రఘురామయ్య, గోపాల్, కృష్ణవేణమ్మ, వెంకట సుప్రజ, విజయలతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ ఇ.ఓ నవీన్ పాల్గొన్నారు. ఆలయ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ తిరుమలలో ఏ విధంగా స్వామివారికి సేవలు ఉంటాయో, అదేవిధంగా ఇక్కడ కూడా అమలు చేస్తామని చెప్పారు. ఊంజల్ సేవ, పల్లకి సేవ ప్రతి శనివారం జరుపుతున్నారని, కళ్యాణం నెలకొకసారి జరిగేటట్లు చేస్తామన్నారు. శ్రీనివాసుని ఆశీస్సులతో రెండవసారి దేవస్థానం అభివృద్ధికి పనిచేసే అవకాశం తనకు కలిగిందని తెలిపారు. అనంతరం పట్టణంలోని పలువురు ప్రముఖులు శ్రీకంటి రామమోహన్‌రావు – రాజ్యలక్ష్మి దంపతులను, సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, జానకిరామిరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కార్యకర్తలు, శ్రీకంటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు 'ప్రగతి' చీరలు



గూడూరు ప్రగతి సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ జన్మదిన వేడుక ఈ నెల 14న బాలాజీనగర్‌లోని ప్రగతి కార్యాలయంలో ఘనంగా జరిగింది. కేక్‌ను కట్ చేసి, 50 మంది నిరుపేద మహిళలకు చీరలు, జాకెట్లు అందజేశారు. ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో ఉత్సాహంగా వ్యాయామ శిక్షణా తరగతులు



ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి వ్యాయామ విద్య అధ్యాపకులు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా, ఈనెల 14న ఆ కార్యక్రమానికి వచ్చిన సభ్యులందరినీ సూళ్లూరుపేట చెంగాళమ్మ గుడి, నేలపట్టు పక్షుల సంరక్షణా కేంద్రం. సముద్ర విహారానికి తీసుకొనిపోవడంతో వారందరూ అన్ని ప్రదేశాలను సందర్శించి చాలా సంతోషించారు. అదేరోజు ఉదయం ఏరోబిక్స్‌లో కుమారి కె.శోభారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో వారు పాల్గొన్నారు. వారు ఈ కార్యక్రమంలో భాగంగా ఉల్లాసంగా మరియు ఉత్సాహంగా పాల్గొన్నారని ఈ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ వి. మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ వి.ప్రసాద్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు(నగరి) 'బయోమెకానిక్స్ ఇన్ స్పోర్ట్స్' అంశం మీద ప్రసంగించి అనంతరం టెన్నిస్ క్రీడ మీద అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు ఎన్‌బికెఆర్‌లో జరగడం సంతోషంగా ఉందని కళాశాల సంచాలకుడు డా.విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంపై వర్క్‌షాప్



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 14న డేటా సైన్స్, పైథాన్ లైబ్రరీస్ అంశాలపై ఈనెల 14న సాంకేతిక నిపుణులు విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. డా.ఆర్‌వి కిషోర్‌కుమార్ ఈ వర్క్‌షాప్ నిర్వహించి డేటా సైన్స్ ఆవశ్యకతను వివరించారు. డేటా సైన్స్‌తో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అనుసంధానించి సరికొత్త ఆవిష్కరణలు చేపట్టవచ్చని వివరించారు. అనంతరం కిషోర్‌కుమార్‌ను సన్మానించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.ఏ.రాజేశ్వరరెడ్డి, ఏఐ అండ్ డిఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ టివి మహేంద్ర పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించండి



ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆంధ్ర మహిళా మండలి సభ్యులు

గతంలో ఆంధ్ర మహిళా మండలికి కేటాయించిన స్థలాన్ని ప్రజాప్రయోజనార్థం అధికారులు రెవెన్యూ శాఖకు అప్పగించడంతో మండలి సభ్యులు ఈ నెల 16వ తేదీ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ మురళీకృష్ణను కలసి తమకు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలంటూ వినతిపత్రం సమర్పించారు. ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, గౌరవాధ్యక్షురాలు డా.చెరుకూరు రోహిణి, పలువురు సభ్యులు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన దేవసేనమ్మ



ఇటీవల గూడూరు పట్టణంలోని 3, 8, 9 వార్డు సచివాలయాలను స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ కాలువలు, పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, శానిటేషన్ అధికారులు, వైసిపి నాయకులు ఉన్నారు.



వైఎస్ఆర్‌సిపి 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల కోటలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి






గూడూరు, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేసిన శ్రీకంటి రామమోహన్‌రావును ఇటీవల ఆయన కార్యాలయంలో సన్మానించి అభినందనలు తెలుపుతున్న లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి షేక్ రియాజ్, కార్యదర్శి కళ్యాణసాయి, జిల్లా ఛైర్మెన్ బి.శీనయ్య, జోన్ ఛైర్మెన్ రామ్మోహన్, సభ్యులు ఇషాక్ తదితరులు



ఇటీవల గూడూరులోని ద్వారకామాయి ఫంక్షన్‌హాలులో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలకు ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగినులను సన్మానిస్తున్న ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

కోవూరు చెరకు రైతులకు..

# త్వరలోనే తీపివార్త

**- డిఏబి చైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి**



కొడవలూరులో రైతుగ్రూప్‌కు వరికోత మిషన్‌ను పంపిణీచేస్తున్న వీరి చలపతి, నిరంజన్‌బాబురెడ్డి

కోవూరులో ఆధునిక యంత్రాలతో షుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే అందుకు సంబంధించి తీపివార్త అందుతుందని ఆకాంక్షిస్తున్నామని డిఏబి చైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి చెప్పారు. ఈనెల 14న విడవలూరు మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, చెరకు రైతులకు మేలు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎంతగానో తపనపడుతున్నారని అంటూ, షుగర్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు పంపిన ప్రతిపాదనలకు కూడా వారు తప్పకుండా ఆమోదం తెలియజేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డిసిఎంఎస్ చైర్మెన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుగ్రూపులకు వరికోత మిషన్లను రాయితీపై అందిస్తోందని, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో మండలంలో 8 యూనిట్లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, వరికోత మిషన్లపై సుమారు 10 లక్షల దాకా రాయితీని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. తొలుత ముదివర్తికి చెందిన శ్రీ రాజరాజేశ్వరి రైతుల గ్రూప్‌కు సబ్సిడీపై ప్రభుత్వం అందజేసిన వరికోత మిషన్‌ను అందజేశారు. అనంతరం కొడవలూరులో జరిగిన కార్యక్రమంలో రామన్నపాళెం క్లస్టర్ పరిధిలోని శ్రీ విఘ్నేశ్వర రైతుగ్రూప్‌కు వరికోత మిషన్‌ను రాయితీపై అందజేశారు.

# రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

**- బిజెపి నేత భరత్‌కుమార్‌యాదవ్**

జిల్లాలోని రైతులకు మద్దతు ధర ఇవ్వాలని, తక్కువ ధరలకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ ఈనెల 14న కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. బిపిటి ధాన్యాన్ని కొంతమంది అధికారులు సాధారణ రకంగా నమోదుచేస్తూ మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధరల పట్టిక పెట్టాలని, ప్రతి నియోజకవర్గంలోనూ మార్కెట్‌యార్డులు ఏర్పాటుచేయాలని కోరారు. బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

# నడకే దివ్యౌషధం

ప్రతిరోజూ కొంతదూరం నడుస్తూ ఉంటే అనేకరకాల శారీరక సమస్యలు మటుమాయమవుతాయని, నడకే దివ్యౌషధమని పలువురు వైద్యులు చెప్పారు. ఈనెల 13న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో స్థానిక ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్‌కు బీపీ, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు, కేతా అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ చక్రపాణి, శరత్‌బాబు, లక్కాకుల శ్రీనివాసులు, సుబ్బరాజు, పి.శ్రీనివాసులు, నజీర్ అహ్మద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాపై

# 'సెబ్' దాడులు

జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలపై సెబ్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా సెబ్ అధికారులు నాటుసారా స్థావరాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. మూడు రోజుల్లోనే 12 కేసులు నమోదుచేసి, ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఈనెల 14న తెలిపారు. ఈ దాడుల్లో 52 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 2,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తంగా ఈ ఏడాది గడిచిన మూడు నెలల్లోనే 171 కేసులు నమోదు చేసి, 521 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 60 మందిని అరెస్ట్ చేశామన్నారు.

# 26న జడ్పీ సమావేశం

నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదిన నిర్వహిస్తామని జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు ఈనెల 14న ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఏపీ జెన్‌కో దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేటీకరించడం వ్యతిరేకిస్తూ గూడూరు సిఐటియు కార్యాలయంలో ఈ నెల 15న పి.మణి అధ్యక్షతన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ ఏపీ జెన్‌కోను ప్రైవేటీకరణ చేస్తే ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, వినియోగదారులు తీవ్రంగా నష్టపోతారని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# కష్టజీవులను ఆదుకోండి

**సిపిఎం నేత మాదాల**

రెక్కాడితే గానీ డొక్కాడని కష్టజీవులైన చెక్కబండి రిక్షా కార్మికులను ఆదుకోవాలని, వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేసి చేయూతనివ్వాలని సిపిఎం నాయకుడు, మాజీ డిప్యూటీమేయర్ మాదాల వెంకటేశ్వర్లు కోరారు. ఈనెల 13న నెల్లూరులోని మన్సూర్‌నగర్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడుతూ నిరుపేద కార్మికులకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలను అందజేయాలన్నారు. ఈ సందర్భంగా చెక్కబండి రిక్షాకార్మికుల యూనియన్‌కు 9 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఈశ్వరరెడ్డి, కార్యదర్శిగా ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షునిగా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా శివారెడ్డి, కోశాధికారిగా శ్రీనివాసులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా నాగరాజు, రాజేంద్ర, ముని ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల క్రిష్ణయ్య, సిఐటియు రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, కాలేషా, నారాయణ ఎన్నికయ్యారు.

# 'అర్చక ప్రపూర్ణ'కు ఆత్మీయ సన్మానం

ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య కార్యదర్శి, నెల్లూరుజిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉదయగిరి శేషాచార్యులను పలు బ్రాహ్మణసంఘాల వారు ఆత్మీయంగా సత్కరించి అర్చకుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఇటీవల హైదరాబాద్‌లోని డాక్టర్ సివి రామన్ అకాడమీ సాంస్కృతిక సేవాసంస్థ వారు శేషాచార్యులకు 'అర్చక ప్రపూర్ణ' బిరుదుతో పాటు సువర్ణ ఘంటా కంకణం బహూకరించి ఘన సత్కారం చేసిన సందర్భంగా జిల్లాలోని వాకాడు, కోట, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన అర్చకులు, బ్రాహ్మణ సంఘాల వారు ఈనెల 13న వాకాడులోని శ్రీ అలఘనాథస్వామి దేవాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాకాడు సొసైటీ చైర్మెన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ అర్చకుల బాగోగులను పట్టించుకుంటూ వారి అభ్యున్నతికి ఎనలేని సేవచేస్తున్న ఉదయగిరి శేషాచార్యుల కృషి అపూర్వమని అన్నారు. వాకాడు ఉప సర్పంచ్ పాపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అర్చక సమాఖ్య నాయకులు పిపిపి ప్రసాదాచార్యులు, ఫణిశర్మ, శ్రీనివాసశర్మ, జొన్నవాడ అర్చకులు, నెల్లూరు టెక్కేమిట్టలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకులు కందుకూరు శేషాచార్యులు, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ గూడూరు డివిజన్ కన్వీనర్ అనంతాచార్యులు, వేదాంతం యుగంధర్, కృష్ణప్రసాదాచార్యులు, కోన చంద్రమౌళి, సోలా కుమార్, ఈదూరు రామాచార్యులతో పాటు అనేక బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు, అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు.

# అపురూపమైన ఆలయం..'బాలాజీనగర్' శ్రీ సీతారామస్వామి మందిరం

*'నీ మహనీయ తత్త్వరస నిర్ణయబోధ కథామృతాబ్ధిలో దా మును గ్రుంకులాడక వృథా తను కష్టముజెంది మానవుం డీ మహిలోక తీర్థములనెల్ల మునింగిన దుర్వికార హృత్తామస పంకముల్ విడునె దాశరథీ కరుణాపయోనిధీ'..*

అంటోంది దాశరథీ శతకం. ఓ రామా!..నీ మహనీయ తత్త్వంతో కూడిన కథామృతమనే సముద్రంలో మునగక, శరీర కష్టంతో మానవులెన్ని తీర్థాల్లో మునిగినా, మనస్సుకు అంటుకుని ఉన్న తమోగుణమనే బురద వీడిపోదు గదా!.. అని భావం. రామ కథామృతం ఎంత శక్తివంతమైనదో.. ఆ దేవుని తత్త్వం ఎంత మహత్తరమైనదో చెప్తోందా పద్యం. మనిషిలోని మాలిన్యాలు కరిగిపోవాలంటే రామనామమే తారకమంత్రమని మన శాస్త్రాలు చెప్తున్నాయి. రాముడు సకల గుణాభిరాముడు. ధర్మనిరతుడు. సర్వశక్తి సమన్వితుడు. ఆదర్శపాలకుడు. రాముని పేరు తలచుకుంటేనే సర్వశుభప్రదం..సకల పాపవిమోచనం. అందుకే మన భారతావనిలో రాముడి పేరు తలవని చోటు, రాముడి గుడిలేని ఊరు ఉండవంటారు. మన జిల్లాలోనూ ఎన్నో రామాలయాలున్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లో కూడా ఎంతోకాలంగా భక్తులు ఒక చక్కని గుడి కట్టుకుని సేవిస్తున్నారు. అదే 'శ్రీ సీతారామస్వామి మందిరం'. ఆ మందిర నిర్మాణం వెనుక ఎంతో ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.

## 75 ఏళ్ళనాటి సీతారామ మందిరం :

అనునిత్యం రామభక్తితో తరించే నెల్లూరుకు చెందిన ఓ భక్తురాలు ఆ మందిర వ్యవస్థాపకురాలు. పేరు స్వర్గీయ తిప్పావఝుల జ్ఞానలక్ష్మమ్మ. సుమారు 75 ఏళ్ళ క్రితం ఆమె బాలాజీనగర్‌లో సీతారాముల సిమెంటు విగ్రహాలు పెట్టుకుని పూజలు చేస్తుండేది. అది గమనించిన చిరమన రుక్మిణమ్మ అనే మరో భక్తురాలు ఆమెకు రామమందిరం కట్టుకోవడానికి







## మన దేవాలయాలు (91)

స్థలాన్ని వితరణగా ఇచ్చి పుణ్యం కట్టుకుంది. జ్ఞానలక్ష్మమ్మ అక్కడ చిన్న గుడి కట్టుకుని పూజలు చేసుకుంటూ కొంతకాలం తర్వాత కపాలమోక్షం పొంది ఆ శ్రీరామునిలో ఐక్యమైంది. ఆ మందిర నిర్వహణా భారాన్నంతా ముందుగానే ఆమె అమర్తలూరు శ్రీనివాసులుగుప్తాకు అప్పగించడంతో, ఆయన అచంచల దైవభక్తితో ఆ రామమందిరాన్ని దివ్యారామంగా తీర్చిదిద్దారు. 1981 జూన్ 11వతేదీన అక్కడే నూతనంగా సీతారాముల మందిరాన్ని సర్వాంగసుందరంగా పునర్నిర్మించారు. ఆ మందిరం ప్రాంగణంలోనే శ్రీరామస్థూపం నిర్మించి రామకోటి పుస్తకాలను భక్తులు నిక్షిప్తం చేసేలా ఏర్పాటుచేశారు. త్యాగరాజ కల్యాణమండపాన్ని నిర్మించి స్థలదాత వాకాటి తిరుపాలు తండ్రి వాకాటి నరసయ్య పేరును చిరస్థాయిగా నిలిపారు. శాశ్వత ప్రాతిపదికన ఆలయ నిర్వహణకు ఓ కమిటీని ఏర్పాటుచేసి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆ మందిరానికి నిర్వహణా సారథిగా ఉండి ఆలయాన్ని ఎంతో అభివృద్ధిలోకి తెచ్చారు. ఆ ప్రాంగణంలోనే అన్నమయ్య గుడి కట్టారు. ఆ తర్వాత కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి మందిరాన్ని కూడా నిర్మించారు. ఉపాలయాలుగా మరకత గణపతి, విష్వక్సేన మందిరాలతో పాటు నవగ్రహాల మండపం, నాగమండపం కూడా నెలకొల్పి ఆలయానికి పరిపూర్ణత తెచ్చారు. ఆధ్యాత్మిక సేవాతత్పరుడైన శ్రీనివాసులుగుప్తా తదనంతరం వారి కుమారుడు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా ప్రస్తుతం ఆలయ చైర్మెన్‌గా, తాతా వెంకటకిషోర్ గౌరవాధ్యక్షునిగా, సోమిశెట్టి వెంకటరత్నం కార్యదర్శిగా, తన్నీరు మస్తాన్‌రావు కోశాధికారిగా ఉంటూ కమిటీ సభ్యులు, దాతలు, స్థానిక ప్రజలందరి సహకారంతో స్వామివార్ల పూజలకు సేవలకు ఏ లోటూ లేకుండా మందిరాన్ని నిర్వహిస్తూ నిత్యం వందలాదిమంది భక్తులకు ఆ సీతారామచంద్రుల సేవాభాగ్యాన్ని కల్పిస్తున్నారు.

## అత్యద్భుతం.. పుత్రకామేష్టియాగం :

ఈ ఆలయంలో స్వామివార్ల పూజలు సేవలకు ఏ లోటూ లేదు. అన్నిటికన్నా ముఖ్యంగా ఏటా 'శ్రీరామనవమి' ముందు రోజున జరిగే పుత్రకామేష్టి యాగం ఒక అద్భుతం. సీతారామచంద్రుల కృపాకటాక్షంతో ఈ యాగంలో పాల్గొన్న భక్తుల కోరికలు నెరవేరుతుండడం, ముఖ్యంగా సంతానం లేనివారికి సంతానభాగ్యం కలుగుతుండడం విశేషం. ఈ యాగంలో పాల్గొనేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. జ్ఞానలక్ష్మమ్మ ఈ యాగసేవను కూడా శ్రీనివాసులుగుప్తాకు అప్పజెప్పడంతో ఆయన దీనిని మహద్భాగ్యంగా భావించి యాగనిర్వహణ చేస్తుండేవారు. ఇప్పుడు ఆయన తనయుడు వెంకటేశ్వర్లుగుప్తా ఉభయకర్తృత్వంలో, కమిటీ వారంతా కలిసి యాగాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది 54వ పుత్రకామేష్టియాగం ఏప్రిల్‌లో శ్రీరామనవమి ముందురోజు వైభవోపేతంగా జరుగనుంది.

# పవర్ చూపిస్తానంటున్న పవన్

(మొదటి పేజీ తరువాయి)



జనసేన పార్టీ ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

లేకుంటే ఏకంగా రాజకీయపార్టీనే పెట్టి తానే పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయినా ఆయనతో జతకట్టిందంటే రాష్ట్రంలో కమలం పార్టీ పరిస్థితి కూడా ఎంత దయనీయంగా ఉందో వేరే చెప్పనక్కర లేదు. అవసరమైతే రేపు తెలుగుదేశంతో కూడా జత కడుతా నంటున్నాడు పవన్. ప్రస్తుత పరిస్థితులలో చంద్రబాబు కూడా పవన్‌కి 'నో'చెప్పే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పుడు ఆయన పార్టీ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఏదిఏమైనా తన లక్ష్యం జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడమే అని మంగమ్మ శపథం చేసి పోరాడుతున్నాడు జనసేనాని.

సినిమా గ్లామర్ వేరే, రాజకీయ చరిష్మా వేరే. ఎంజిఆర్, ఎన్టీఆర్ లాంటి వారు రాజకీయ రంగ ప్రవేశం చేసినినాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. నిజంగా సినీ స్టార్లు పార్టీకి జనం నీరాజనాలు పట్టే పరిస్థితే వుంటే 2009లో ఈ పవర్‌స్టార్ అన్న మెగాస్టార్ అలా దగా పడేవాడు కాదు. ఇప్పుడు రాజకీయ నాయకులకు కావలసింది నటన కాదు. ప్రజలను మెప్పించగలిగిన సమర్ధత. తమను బాగా పాలించగలడన్న నమ్మకం ప్రజలకి ఇవ్వాలి. ఆ నమ్మకాన్ని దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఇచ్చారు. అందుకే ఇప్పుడు ఆయన కొడుకుని కూడా అదే నమ్మకంతో ప్రజలు గెలిపించారు.

రేపు రాబోయే సార్వత్రిక ఎన్నికలలో భాజపా, తెలుగుదేశం, జనసేన కలసి పోటీ చేసినా మనం ఆశ్చర్యపోనవసరంలేదు. 'వైసీపీ వ్యతిరేక ఓటును మేము చీల్చం' అని పవన్ ప్రకటించడం వెనుక ఉన్న మర్మం ఇదే. తాను ఏకై వచ్చి.. మేకై మారి.. అందరినీ ఏకం చేసైనా జగన్ సర్కారుని గద్దె దించుతానని అంటున్నాడు పవన్. అంతా బాగానే ఉంది... ఆయన పెడుతున్న సభలకు లక్షల సంఖ్యలో పోటెత్తుతున్న జనం, అదే స్థాయిలో ఓటెత్తుతారా...? లేక ఏకై... మేకై.. ఏకమై అంటున్న ఆయనను మళ్ళీ ఏకాకిగా మిగులుస్తారా వేచి చూడాల్సిందే...!

## అక్షయం.. అక్షరం

అక్షయం అక్షరం
ఆగని కలానికి కల్పవృక్షం
ఆలోచించే మనసుకు
కామధేనువై
అగ్నికి ఆజ్యం తోడైనట్లు
మెదడుకు పదును పెట్టే కత్తిలా
స్వచ్ఛమైన కవిత్వానికి
నిర్వచనం ఇవ్వగా
వస్తు వైవిధ్యం భిన్నత్వంలో
ప్రత్యేకత
తొణికిసలాడే
సాహిత్య సృజనకు వేదికలైన....
సర్వసౌందర్యాలకు కళాపోషకాలకు
తరువులు దరువులు సెలయేళ్ళు
పురాణగాథలలోని వివిధ వర్ణనలు
ఒకటేల ఎన్నెన్నో
కవులకు రచయితలకు
అత్యంత కీలకమైన అంశాలై
కలానికి పరుగులు పెట్టిస్తూ
రాయాలన్న ఊహల తలపులకు
ప్రోత్సాహమందిస్తూ
అక్షయమైనది అక్షరం.



దూబగుంట రామకృష్ణ
తిరుపతి. 9652021126.

## పంచాయతీల్లో కంప్యూటర్ల కొనుగోళ్ళకు

# కేంద్రం సాయం చేస్తుందా?

### - పార్లమెంట్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్న



ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 13,370 పంచాయతీలుంటే వాటిలో 5500 పంచాయ తీల్లో కంప్యూటర్లు లేవన్నది వాస్తవమేనా?.. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద ప్రభుత్వం గ్రామ పంచాయితీల ఇ-ఎనేబుల్‌కు కంప్యూటర్లను కొనుగోలు చేయడానికి రాష్ట్రాలకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంద నేది వాస్తవం కాదా?.. అని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఈనెల 16న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అంతేకాదు, 15వ ఆర్థిక సంఘం కూడా గ్రామీణ స్థానిక సంస్థల ద్వారా కంప్యూటర్‌లను కొనుగోలు చేసేందుకు నిధులను సిఫారసు చేసిందనేది వాస్తవం కాదా?..అని ఆయన ప్రశ్నిస్తూ అందుకు సంబంధించిన వివరాలు తెలపాలన్నారు. స్పందించిన కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ సమాధానం చెప్తూ, పంచాయతీ రాష్ట్రానికి సంబంధించినది కావడం, కంప్యూటర్లు తదితర మౌళికసదుపాయాలను కల్పించడమనేది ప్రధానంగా రాష్ట్రప్రభు త్వాల బాధ్యత అని అన్నారు. అయినప్పటికీ పంచాయతిరాజ్ మంత్రిత్వశాఖ తన పథకాల ద్వారా రాష్ట్రాల అవసరాలను భర్తీచేస్తోందన్నారు. ఏపీలోని 5517 పంచాయతీల్లో కంప్యూటర్లు లేవని తెలిపారు. గ్రామీణ, స్థానిక సంస్థల్లో కంప్యూటర్లు, ఉప కరణాల కొనుగోలు అంశాలు 15వ ఆర్థికసంఘం ప్రాథమిక గ్రాంట్‌ల, సాంకేతికత, అడ్మినిస్ట్రేటివ్ భాగాల సూచికలో చేర్చారని పేర్కొన్నారు. 15వ ఆర్థికసంఘం కింద రాష్ట్రానికి 3594.50 కోట్లు విడుదల చేశామని కేంద్రమంత్రి వెల్లడించారు.

## కృష్ణచైతన్యలో ఉత్సాహంగా..

# ఫ్రెషర్స్‌డే వేడుకలు




కృష్ణచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కాకుటూరు కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఈనెల 16న కళాశాల ఆవరణలో, కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిల పర్యవేక్షణలో ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఆర్‌వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల 1998వ సంవత్సరంలో 142 మంది విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు 16వేల మంది విద్యార్థులను కలిగి ఉండటం కళాశాల పట్ల తల్లిదండ్రులు విద్యార్థుల నమ్మకానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లి తండ్రులను, గురువులను ఏనాటికీ మరచిపోకూడదని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ పట్ల అవగాహనతో ఉండాలన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యు. మల్లికార్జునయ్య, పీజీ ప్రిన్సిపల్ టి. జ్యోతి, అడ్మిన్ ప్రిన్సిపల్ పి. సుబ్బారావు, మరియు హెచ్‌ఓడి ప్రసాద్, ఫణి, అధ్యాపకులతో పాటు పెద్దసంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం.. ప్రసన్నుని గరుడోత్సవం

బోగోలు మండలంలోని కొండబిట్రగుంటలో కొలువైవున్న బిలకూటక్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 16న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి గరుడ వాహనసేవ నిర్వ హించారు. ఉదయం మోహినీ అవతారోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ శీనానాయక్, ఆలయ ఛైర్మెన్ శ్రీరాంమాల్యాద్రి, ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఇ.ఓ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

# అసెంబ్లీ ప్రవేశ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)



శాసనసభాపక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

చెప్తూనే మరోవైపు సర్వేలో మార్కులు పడకపోతే టిక్కెట్ కూడా రాదన్న చేదు కబురు కూడా చల్లగా చెప్పేశారు జగన్. ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవాళ్ళు మాజీలుగా మారాక పార్టీ బాధ్యతలు భుజానికెత్తుకోవాలని సూచించారు. మళ్ళీ పార్టీని గెలిపించి అధికారంలోకి తెస్తే అప్పుడు ఈ మాజీలకు మళ్ళీ మంత్రి పదవులిచ్చి తాజాగా మంత్రి పదవులు పొందబోయే వారిని మాజీలను చేసి పార్టీ బాధ్యతలు అప్పజెప్తామని అన్నారు. ఇప్పటివరకు మంత్రులుగా ఉన్నవారు తాముచేసిన పనులను ప్రజలకు వివరించి వాళ్ళ వద్ద మార్కులు వేయించుకుని మళ్ళీ గెలిచి రావాలని సలహా ఇచ్చారు. అంతే కాకుండా ఇప్పటివరకు మంత్రులుగా పనిచేసిన వారికి ప్రజల సమస్యలపట్ల అవగాహన రావడంతో పాటు రాబోయే ఎన్నికలను సమర్ధవంతంగా ఎదుర్కోగలిగిన సమర్ధత, స్థోమత వచ్చి ఉంటాయని తాను భావిస్తున్నానని అన్నారు. పార్టీకి అన్నివిధాలా అండగా నిలవగలిగే సామర్ధ్యం ఉన్నవారే మళ్ళీ గెలిచి రాగలరన్న విషయాన్ని నర్మగర్భంగా ప్రకటించారు.

### ఉగాది నుండి వేగం పెంచాలి...

ఈ సమావేశంలో జగన్‌మోహన్‌రెడ్డి అనేక ఆసక్తికర అంశాలు చర్చించారు. దాదాపు 28 నిముషాల పాటు ఆయనే మాట్లాడారు. మన ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కూడా పూర్తి కావొస్తోంది. ఇక నుంచి ప్రతిఒక్కరూ ప్రజలలోకి వెళ్లి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ఆదేశించారు. పార్టీ పరంగా స్వీయ అనుభవంతో చెప్తున్నాను, గడపగడపకూ వెళ్లడం కన్నా మరే ఇతర ప్రభావవంతమైన కార్యక్రమం లేదు. ఒక ఎమ్మెల్యే గెలిచి శాసనసభలో కూర్చోవాలంటే ఖచ్చితంగా ఆ వ్యక్తి కనీసం మూడుసార్లైనా ప్రజల ముంగిళ్ళలోకి వెళ్ళి పలకరించాలి, అప్పుడే మంచి ఫలితాలను సాధించగలమని అన్నారు. అలా చేయని పక్షంలో ఎంతమంచి ఎమ్మెల్యే అయినా గెలవడం అనుమానమే అన్నారు. తాము ఇళ్లలో కూర్చుని ప్రజలను తమవద్దకు రప్పించుకునే సంప్రదాయానికి ఇక స్వస్తి పలకాలని హితవు పలికారు.

గ్రామ వార్డు సచివాలయాల వలంటీర్ల సేవలు గుర్తించి, ఉగాది నుండి వారికి సేవా వజ్రాలు, సేవా మిత్రులు, సేవా రత్నాలు పేరుతో అవార్డులు అందజేయనున్నామని ప్రకటించారు. ప్రభుత్వం వైపునుంచి పారితోషకంతో పాటు మెడల్ కూడా ఇస్తామన్నారు. ఏప్రిల్ 2న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం నెలరోజులపాటు సాగుతుందన్నారు.

ఇంకా అనేక విషయాలను ఆయన తన బృందానికి వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. బంపర్ ఆఫర్‌గా ఒక్కొక్క నియోజకవర్గానికి 2 కోట్ల నిధులను కూడా ప్రకటించారు. ఏప్రిల్ 15వ తేదీకల్లా పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులన్నీ చెల్లించేస్తామని వరమిచ్చాడు.

### ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకూ మీకు పరీక్ష...

ఏప్రిల్ 2 ఉగాది నుండి 2022 డిసెంబర్ వరకూ అందరూ పూర్తిస్థాయిలో ప్రజాక్షేత్రంలోనే పనిచేయాలని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం కొంతమంది పార్టీ శ్రేణుల్లో కొన్ని అనుమానాలను రేకెత్తిస్తున్నాయంటున్నారు విశ్లేషకులు. ఎన్నికలకు ఇంకా రెండేళ్లు గడువు ఉంది కదా...! డిసెంబర్ టార్గెట్ ఏమిటి అన్నది వారి అనుమానం. జనవరి 2023 తరువాత ముందస్తు ఎన్నికలకు వెళ్తారా..? అన్నది కూడా వారి అనుమానం. ఏదిఏమైనా ఏప్రిల్ రెండవతేదీ నుండి కొత్త జిల్లాలు ఏర్పడి ఆ తరువాత కొత్త మంత్రులు రాబోతున్నారు. జులై 8న పార్టీ ప్లీనరీ సమావేశం నిర్వహించి పార్టీని కొత్తపుంతలు తొక్కించబోతున్నారు. పేరుకి డిసెంబర్ వరకూ అని ముఖ్యమంత్రి ప్రకటించినా ఈ తంతు ఎన్నికలవరకూ నడుస్తుందని విశ్లేషకుల అంచనా. 'మీ పనితీరుకు ఇది పరీక్షా సమయం' అని జగన్ చెప్పినా, ఖచ్చితంగా శాసనసభలో మళ్లీ లేదా కొత్తగా అడుగుపెట్టాలనుకునే వారికి ఇది ప్రవేశపరీక్షే అన్న విషయం అందరికీ అర్ధమై పోతుంది. జగన్‌మోహన్‌రెడ్డి నాడి తెలిసిన కొందరు శాసనసభ్యులు ఇప్పటికే ప్రజల వద్దకు పాలన అంటూ వీధి బాటను పట్టడం మనం చూస్తూనే ఉన్నాం. వారికైనా టిక్కెట్టు గ్యారంటీ ఉందా అని సలహాదారులను అడిగితే... ఏమో చెప్పలేం అని వారు పెదవి విరవడం కొసమెరుపు.

# కష్టమర్లే మా దేవుళ్ళంటున్న

## హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ మేనేజర్ జితేంద్ర

గత వారం 'లాయర్'లో 'అప్పుతీరిస్తే చుక్కలు చూపిస్తున్న హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ నెల్లూరుశాఖ' అని వచ్చిన వార్తకు ఆ సంస్థ నెల్లూరుశాఖ మేనేజర్ జితేంద్ర స్పందించారు. తమ సంస్థకు కష్టమర్లే దేవుళ్ళని అన్నారు. ఫిబ్రవరి14న గృహ లోను చెల్లించిన ఖాతాదారులు తమకు త్వరగా డాక్యుమెంట్లు కావాలని చూపించిన ఆత్రుత కారణంగా కొంత గందరగోళం ఏర్పడిందని వివరణ ఇచ్చారు. తమ సిబ్బందిలో ఒకరు కొత్తవాడు కావడంతో అవి విజయవాడలో ఉన్నాయా లేక ముంబైలో వున్నాయా అన్న సమాచార లోపం ఏర్పడడంతో వాళ్ళకు కొంత అసౌకర్యం కలిగింది తప్ప, తమ కష్టమర్లను తాము ఎలాంటి ఇబ్బందికి గురిచేయలేదని చెప్పుకొచ్చారు. వారికి చెప్పిన గడువు ప్రకారం వారి పత్రాలు వారికి అందచేశామని తెలిపారు. గృహ, స్థల రుణాల విభాగంలో తమ శాఖ అత్యధిక వ్యాపారాన్ని సాగిస్తుందని, వచ్చే ప్రతీ ఖాతాదారుడిని దైవంతో సమానంగా చూస్తాం కాబట్టే అది సాధ్యమైందన్నారు. అనేక ప్రైవేటు గృహ రుణ విభాగ సంస్థలతో పోలిస్తే తమ సంస్థే ఋణం మంజూరు చేయడంలోగాని, ఋణం తీర్చినప్పుడు పత్రాలు తిరిగి ఇవ్వడంలోగానీ అగ్రగామిగా ఉందని చెప్పారు.

### నూనెల ధర పెంచి అమ్ముతున్న..

## 17 దుకాణాలపై కేసులు



డీమార్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఎస్పీ కె.రాజేశ్వరరెడ్డి

వంట నూనెల ధరలు తమ ఇష్టం వచ్చినట్లు పెంచేసి, కృత్రిమ కొరతను సృష్టిస్తూ అధికధరలకు అమ్ముతున్న దుకాణాదారులపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. విజిలెన్స్ ఎస్పీ కె.రాజేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్లు మాణిక్యాలరావు, సుధాకర్‌రెడ్డి, పెంచలరెడ్డిలతో పాటు తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీకర్, సిబ్బంది అంతా కలిసి ఈనెల 14న జిల్లావ్యాప్తంగా నూనెల అంగళ్ళలో పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. ఎంఆర్‌పి ధరల కన్నా ఎక్కువ ధరలకు నూనెలను విక్రయిస్తున్న 17 దుకాణాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. అల్లూరులో 8, కసుమూరులో 3, నరుకూరులో 2, ముత్తుకూరులో 1, నెల్లూరు రూరల్‌లో 3 వంతున కేసులు పెట్టారు. అదేవిధంగా డీ-మార్ట్‌లో పరిమితికి మించి నిల్వ ఉంచిన 9595 కేజీల వంటనూనెను అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## జెన్‌కోను ప్రైవేటుపరం చేయొద్దు

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వద్ద ఉన్న ఏపి జెన్‌కో పవర్‌ప్రాజెక్టును ప్రైవేట్‌పరం చేయొద్దని సిపిఐ, సిపిఎం నాయకులు కోరారు. ఈనెల 14న ముత్తుకూరులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జెన్‌కో ప్రాజెక్టును ప్రైవేట్‌పరం చేస్తే అందులో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్మికులకు ఉద్యోగాలు లేక వీధినపడ్డారని, ప్రైవేటీకరణ పేరుతో కార్మికులు తొలగిస్తే వాళ్ల పరిస్థితి ఏంకావాలని వారు ఆవేదన చెందారు. యాజమాన్యం కార్మికుల జీవన స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటీకరణను మానుకోవాలని, తద్వారా కార్మికులకు అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మోహన్‌రావు, రాధయ్య, అంకయ్య, నందయ్య, శేషయ్య, వెంకటేశ్వర్లు, శీనయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## బాలత్రిపురసుందరీదేవికి కుంకుమపూజ

సైదాపురంలో కొలువైఉన్న శ్రీ బాలపుత్రిపురసుందరీదేవి అమ్మవారి ఆలయంలో ఇటీవల అమ్మవారికి విశేష పూజలు చేశారు. పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. అభిషేక సేవల అనంతరం కుంకుమపూజ రాహుకాల పూజలు నిర్వహించారు. అనంతరం దాత శిరీషానాయుడు సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

### గుర్తింపుకార్డులు లేక..

## రైతులకు ఎన్నో అవస్థలు

**- బిజెపి నాయకుడు మిడతల రమేష్**

రైతులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపుకార్డులు ఇవ్వాలని బీజెపి 'నమామి గంగే' రాష్ట్ర కార్యదర్శి మిడతల రమేష్ కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ ఇటీవల ఆయన బుచ్చిరెడ్డిపాళెంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి కార్యకర్తలతో కలిసి ధర్నా చేశారు. రైతులకు గుర్తింపు కార్డులు లేనందువల్ల వారు తమ పంటలు అమ్ముకోలేక, ప్రభుత్వం పాత బకాయిలను చెల్లించకపోవడంతో అప్పులు కట్టుకోలేక రైతులు కష్టాలు పడుతున్నారన్నారు. జిల్లాలో సుమారు 8 లక్షల ఎకరాల్లో వరి సాగైతే, 2 లక్షల ఎకరాలు ఇ-క్రాప్‌లో నమోదయ్యాయని, దాదాపు 90వేల మంది కౌలు రైతులు ఇ-క్రాప్‌లో నమోదయ్యేందుకు అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. కాసా శ్రీనివాసులు, రామిశెట్టి మోహన్, శ్రీనివాస తేజ పాల్గొన్నారు.

# వై.ఎస్. మరణంతో పాటే... కాంగ్రెస్‌పార్టీ కూడా!



రాజకీయ జీవిత క్లైమాక్స్‌లో ఆంధ్రుల అభిమాన నేతగా చిరస్మరణీయమైన కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్న డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో కాంగ్రెస్‌పార్టీ కూడా మరణశయ్యపైకి చేరినట్టు కనపడుతోంది. లేదా మరణశయ్యపైకి కాంగ్రెస్‌పార్టీ చేరడానికి తొలి అడుగు డాక్టర్ వైఎస్ మరణంతో పడింది.

2004లోనూ, 2009లోనూ ఆంధ్రప్రదేశ్‌తో పాటు, దేశంలోనూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి డాక్టర్ వైఎస్ ప్రజాభిమాన... ప్రజాకర్షణ శక్తి, నాయకత్వ పటిమ ప్రధాన కారణాలు. ఆ రెండుసార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆ విషయాన్ని బహిరంగంగానే చెప్పారు.

ఆయన బతికున్నంత కాలం, రాష్ట్రంలోని కాంగ్రెస్ వాదులకు వై.యస్సే కాంగ్రెస్ హైకమాండ్‌గా ఉన్నారు. అప్పుడు మంత్రిగా ఉన్న పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆ విషయం స్పష్టంగా చెప్పారు... 'మాకు కాంగ్రెస్ హైకమాండ్ అంటే వై.ఎస్సే...' అని.

కేంద్ర కాంగ్రెస్ అవసరాలను చూస్తుండడంతో పాటు రాష్ట్ర కాంగ్రెస్‌ను కంటి చూపుతో... చిరునవ్వులతో నడిపించారు. డాక్టర్ వై.ఎస్ - డాక్టర్ కేవీపీ రామచంద్రరావు ఆనాటి కాంగ్రెస్ రాజకీయాలను... బాపు, రమణలా నడిపించారు.

కాంగ్రెస్‌లో సవాలక్ష లోపాలు, బలహీనతలు ఉన్నప్పటికీ, సోనియా గాంధీకి వీర విధేయుడిగా వై.ఎస్ ఉన్నారు. సొంతంగా ఓ ప్రాంతీయపార్టీ పెట్టగలిగిన సామర్థ్యం, పాపులారిటీ, స్థాయి, ప్రజాకర్షణ పుష్కలంగా ఉన్నప్పటికీ ఆ దిశగా ఆయన అసలు ఆలోచించలేదు.




ఆయనకు, ఆ అకాల మరణం ప్రాప్తించకుండా ఉన్నట్లయితే టీఆర్ఎస్ తెలంగాణలో తెరమరుగై ఉండేది. రాష్ట్రం నుంచి 13 జిల్లాలను విడదీసే 'సాహసం' సోనియా, ఆమె కుమారుడు రాహుల్ చేసి ఉండేవారు కాదు. రాష్ట్ర విభజనకు అనుకూలంగా వెంకయ్యనాయుడు, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్ వంటి వారికి నోరు పెగిలి ఉండేది కాదు. యూ.పీ.ఏ-3 పాలనను కూడా దేశం చూసి ఉండేది. వైఎస్ఆర్ సీపీని గానీ వైస్సార్‌టీపీని గానీ, బ్రదర్ అనిల్ కుమార్ ప్రకటనలను గానీ టేస్ట్ చూసే భాగ్యం తెలుగు ప్రజలకు పట్టి ఉండేది కాదు(అంటే వైఎస్‌ను బట్టి జగన్, షర్మిల, బ్రదర్ అనిల్‌కుమార్ కాంగ్రెస్ లోనే ఉండేవారు అని అర్థం).

కానీ, కాంగ్రెస్ దురదృష్టం. దేశం దురదృష్టం. తెలుగు ప్రజల దురదృష్టం. 2009లో రెండోసారి గెలిచి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొద్ది నెలలకే అదే ఏడాది సెప్టెంబర్ 2న ఒక హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన అకాల మృత్యువు పాలయ్యారు.

దీంతో కాంగ్రెసుకు కళ తప్పింది. మోహం మీద బొట్టు చెరిగిపోయింది. హైదరాబాద్‌లో కూర్చునే, దేశ కాంగ్రెస్ రాజకీయాలకు దారీ, తెన్నూ చూపిస్తూ వచ్చిన ఒక జనాకర్షక నేత రాజశేఖరరెడ్డి అనూహ్య మరణంతో నాలుగు పక్కల నుంచి గొంతులు పైకిలేచాయి. విభజన శక్తులు కొత్తగా ఊపిరి పోసుకున్నాయి. కాంగ్రెస్‌లో అప్పటివరకు తోకలు లోపలికంటా దోపుకుని మౌనంగా ఉన్న అసమ్మతి గళాలు... తోకలు బయటకు తీశాయి. గొంతులు సవరించుకున్నాయి. అనాథగా మిగిలిపోయిన కాంగ్రెస్ పగ్గాలను వైఎస్ కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డికి అప్పగించి ఉన్నట్లయితే రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి 'రాజకీయ స్ఫూర్తి' కొనసాగి ఉండేది. కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన నాయకుడిగా తండ్రి బాటలో జగన్ నిలబడి ఉండేవారు. కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్ ఒక బలమైన అడ్డాగా కొనసాగుతూ ఉండేది. రాష్ట్రం విడిపోయి ఉండేది కాదు. కాంగ్రెస్‌కు రెండుపక్కలా పుట్టగతులు లేకుండా పోయేవి కాదు.

కానీ, విధి బలీయం కదా! జగన్‌కు బదులు 'దారినిపోయే దానయ్యను' అని చెప్పుకున్న రోశయ్యను ముఖ్యమంత్రిగా చేశారు. ఇక అక్కడినుంచి ఏమి చేస్తే దేశ రాజకీయ చిత్రపటం నుంచి కాంగ్రెస్ కనుమరుగవుతుందో... సరిగ్గా అవే పనులను ఆ అమ్మా కొడుకులు చేసుకుంటూ వచ్చారు. వారి పుణ్యమా అని 13 జిల్లాలుగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా, సంపూర్ణంగా, శేషం లేకుండా తుడిచిపెట్టుకొనిపోయింది. తెలంగాణలో సైతం కాంగ్రెస్‌పార్టీని అధికారానికి సుదూరంగా ప్రజలు తరిమికొట్టారు. 42 లోక్‌సభ స్థానాలున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 39, 40 స్థానాలు తెచ్చుకునే అవకాశం ఉన్న కాంగ్రెస్‌పార్టీని మూడు, నాలుగు స్థానాలకు సోనియా, రాహుల్ పరిమితం చేశారు. మహామహులైన తెలుగు కాంగ్రెస్ నేతలు పలువురిని తెరమరుగు చేశారు. వారి అనుభవం, శక్తి సామర్థ్యాలను నిలువునా వ్యర్థం చేశారు.

సోనియాగాంధీ పుత్రప్రేమ కాంగ్రెస్‌పార్టీని నిర్వీర్యం చేసింది. ఇక్ష్వాకుల కాలం నుంచి కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతున్నవారు చేతికర్రలతో... సహాయకుల ఆసరాతో లేకుండా నడవలేక పడకుర్చీలకు పరిమితమై సోనియా అష్టోత్తర నామావళికి అలవాటు పడినవారు యువరక్తపు మాటకు పార్టీలో విలువ లేకుండా చేశారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి లాగా చొరవ తీసుకుని, 'ఇది తప్పు...ఇది ఒప్పు' అని చెప్పగలిగిన నేతలకు స్థానం లేకుండా చేశారు.

యూపీఏ-2 అనే పాడి ఆవును ఎవరికి వీలైనంత వారు సోనియాతో సహా పిండుకోవడం ప్రారంభించారు. ప్రధాని పదవిలో ఉన్న డాక్టర్ మన్మోహన్‌సింగ్ వ్యక్తిగతంగా స్ఫటికంలా నిష్కళంకుడే అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీపై గానీ, కేంద్ర ప్రభుత్వ పాలనా వ్యవస్థ పైగానీ ఎటువంటి ప్రభావాన్ని చూపించలేకపోయారు. పైపెచ్చు రాహుల్‌తో సహా చాలామంది కాంగ్రెస్ నాయకులకు ఆయన లోకువ కూడా అయ్యారు. ఇక, సోనియాగాంధీ బాధ్యతలు లేని పెత్తనానికి, అధికారానికి పరిమితులు లేకుండా పోయాయి.

ఇటువంటి వికృత చేష్టలతో కాంగ్రెస్‌పార్టీ దేశ ప్రజల దృష్టిలో వీలైనంత చులకన అయింది. నెలకో కుంభకోణం వెలుగులోకి వస్తున్నప్పటికీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నోరు మెదపలేదు. తన మంత్రులపై ఆయనకు ఏమాత్రం అదుపు లేదనే విషయం ప్రజలలో నవ్వులాటకు దారి తీసింది. సోనియా, రాహుల్‌ల బాధ్యతలు లేని అధికారం చెలాయింపును చూసి, కాంగ్రెస్‌పార్టీని జనం యావగించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ 'తల్లికి బిడ్డ భారమా....బిడ్డకు తల్లి భారమా' అన్నట్టుగా ఒకప్పుడు 'ఆవు -దూడ' ఎన్నికల చిహ్నం కలిగిన కాంగ్రెస్‌పార్టీ తన పూర్వ వైభవాన్ని కోల్పోతున్న తీరు చూసిన గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ... ప్రధాని పదవికి స్కెచ్ వేశారు. ఒక వ్యూహం ప్రకారం ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటూ వెళ్లి 'ఇదిగో 56 అంగుళాల ఛాతి... కాంగ్రెస్‌లో ఎవరికైనా ఉన్నదా?' అంటూ తన మాటకారీతనాన్ని దేశప్రజల ముందు ఆవిష్కరించారు.

అంతే! జనం సమ్మోహితులయ్యారు.వెర్రెత్తిపోయారు. అప్పటికి పదేళ్లుగా కాంగ్రెస్ వ్యవహారశైలిని నిస్సహాయంగా చూస్తూ వస్తున్న జనానికి బురదలో విరిసిన కమలంలా నవనవోన్మేషంగా మోదీ కనిపించారు. మోదీ (బీజేపీ కాదు )కి ఓటు వేయని జన్మ కూడా ఒక జన్మేనా అనుకుంటూ పోయి కాంగ్రెస్‌ను సోనియా ఇంటి (నంబర్ 10, జనపథ్ రోడ్)కి పంపించి వేశారు. 2014 ఎన్నికలకు ముందు గుజరాత్ ముఖ్యమంత్రి ఎన్నికల అనంతరం దేశ ప్రధాని అయ్యారు.

ఇక అప్పటినుంచి 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అనే నరేంద్రమోదీ లక్ష్యానికి సోనియా, రాహుల్‌లు ఇతోధికంగా తమ సాయం అందిస్తూ వచ్చారు. 136 ఏళ్ళకుపైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీ సోనియా, రాహుల్ ఇళ్లకే పరిమితం అయిపోయింది. 29 రాష్ట్రాలకుగానూ ఇప్పుడు రెండు రాష్ట్రాలకు పరిమితమైంది. ఆ రెండు రాష్ట్రాలు రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ ప్రజల తప్పేమీ లేదు. ఎన్నికలు వచ్చే ఏడాది నవంబర్‌లో జరగాల్సి ఉంది. ఈలోపు వారు మాత్రం ఏం చేస్తారు, పాపం ! వెయిట్ చేస్తున్నారు, ఎన్నికల కోసం.

ఆ రాష్ట్రాలలో కూడా ఎన్నికలు జరిగితే 136 సంవత్సరాలకు పైబడిన ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీ ముగింపుకు చేరుకుంటుంది.

ఇప్పుడు ఎన్నికలు అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ పరిస్థితి పూర్తిగా మండు వేసవిలో... భూగర్భ జలమట్టాల్లా... అడుగంటిపోయింది. 403 అసెంబ్లీ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో మొన్న జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం 3. వచ్చిన సీట్లు 2.

జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి కాంగ్రెస్ మహామహులను, చరిత్రకారకులను దేశానికి అందించిన ఉత్తరప్రదేశ్‌లో అమ్మా కొడుకులకు నిలువ నీడ లేకుండా పోయింది. రాహుల్‌గాంధీ కేరళ రాష్ట్రంలో ఆశ్రయం పొందాల్సివచ్చింది. గత ఐదేళ్లుగా పంజాబ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రజలు ఊడ్చి అవతల పడేశారు.

నిజానికి, ప్రజల నర నరానా కాంగ్రెస్‌పార్టీ జీర్ణించుకు పోయి ఉంది. కానీ, కాంగ్రెస్ వ్యవహారశైలి వల్ల , ఈ రోజున దేశంలో ప్రముఖ నేతలుగా వెలుగొందుతున్న ప్రాంతీయ నేతలు ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. ఆ పార్టీలోనే ఉండి ఉంటే.... వారు కూడా కేవీపీ రామచంద్రరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, పళ్ళం రాజు, లగడపాటి రాజగోపాల్, వట్టి వసంతకుమార్, ఉండవల్లి అరుణకుమార్, రఘువీరారెడ్డి, హర్షకుమార్ వంటి వారిలాగా రాజకీయంగా నిర్వీర్యమైపోయేవారు. పడకుర్చీలకు పరిమితమై ఉండేవారు.

నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, బీజేపీని బలోపేతం చేయడంలో పరోక్షంగా తమవంతు పాత్ర పోషిస్తున్న ఆ తల్లీ పిల్లలను బీజేపీ పెద్దలు ప్రేమగా... జాగ్రత్తగా... అభిమానంగా, ఆప్యాయంగా చూసుకోవాలి. అంతటి 'వ్యతిరేక మిత్రులు' బీజేపీకి మాత్రం ఎక్కడ దొరుకుతారు గనుక?!

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com



# మరో అరుదైన రికార్డు సాధించిన మన సతీష్‌రెడ్డి

- హైబ్రిడ్ టెక్నాలజీతో కేవలం 45 రోజుల్లోనే ఏడంతస్తుల భవనం
- ప్రారంభోత్సవం చేసిన కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



*ప్రఖ్యాత శాస్త్రవేత్త, డిఆర్‌డిఓ ఛైర్మెన్..మన నెల్లూరీయుడైన సతీష్‌రెడ్డి సారథ్యంలో డిఆర్‌డిఓ మరో ఘనవిజయం సాధించింది. ఆయన నేతృత్వంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా ముందుకు దూసుకు పోతున్న డిఆర్‌డిఓ (భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ) నిర్మాణరంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తోంది. ఇన్-హౌస్ హైబ్రిడ్ టెక్నాలజీని ఉపయోగించి రికార్డు స్థాయిలో కేవలం 45 రోజుల్లోనే ఏడంతస్తుల సాంకేతిక భవనాన్ని నిర్మించి డిఆర్‌డిఓ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది.*

ఒక్క అంతస్తుతో భవనం కట్టాలంటేనే నెలల తరబడి కష్టపడాల్సి వస్తుంది. కానీ నేటి అధునాతన కాలంలో అత్యంతాధునిక పరిజ్ఞానంతో డిఆర్‌డిఓ సంస్థ ఒకటిన్నర నెలలోనే దాదాపు 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యద్భుతమైన రీతిలో ఏడంతస్తుల సాంకేతిక భవనాన్ని నిర్మించి అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. బెంగుళూరులో ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్ కోసం బహుళ అంతస్తుల భవనాన్ని డిఆర్‌డిఓ రూపు దిద్దింది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడిఇ) చేపడుతున్న ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం ఏవియానిక్స్ మరియు అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసిఏ) కోసం, ఫ్లైట్ కంట్రోల్ సిస్టం (ఎఫ్‌సిఎస్) మరియు ఇతర ఎయిర్‌బోర్న్ సిస్టమ్‌లను అభివృద్ధి చేయడంలో ఆర్అండ్‌డి కార్యకలాపాలకు మద్దతుగా ఈ నూతన భవనాన్ని అందించాలని నిర్ణయించారు. కేవలం 45 రోజుల తక్కువ వ్యవధిలో కాంపోజిట్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ ద్వారా ఆర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2022 ఫిబ్రవరి 1న దీని నిర్మాణం ప్రారంభమైంది. నిర్ణీత లక్ష్యం నాటికి ఈ భవనం పూర్తయింది. ఐఐటి మద్రాసు, రూర్కీ ఐఐటి బృందాలు, డిజైన్ తనిఖీతో పాటు సాంకేతిక సహాయాన్ని అందజేశాయి. మార్చి 17వ తేది గురువారం నాడు బెంగుళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడిఇ) కాంప్లెక్స్‌లో ఈ భవనాన్ని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అందరి హర్షధ్వానాల మధ్య ఆ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. హైబ్రిడ్ టెక్నాలజీని ఉపయోగించి ఏడంతస్తుల శాశ్వతభవనాన్ని అత్యంత తక్కువ వ్యవధిలోనే నిర్మించడంలో డిఆర్‌డిఓ ప్రతిభ దేశంలోని నిర్మాణరంగం పరిశ్రమలోనే ఒక మైలురాయి వంటిదని అందరూ కొనియాడుతున్నారు.

### అమరజీవి ఆశయాల బాటలో నడుస్తాం...

# చెన్నైలో స్మారక భవనం పునరుద్ధరిస్తాం

**- కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి**



చెన్నై, మైలాపూర్‌లో ఉన్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మారకమందిరాన్ని త్వరలోనే పునరుద్దరించి అభివృద్ధి చేస్తామని అమరజీవి స్మారకభవనం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. అమరజీవి 121వ జయంతి కార్యక్రమం ఈనెల 16న చెన్నైలో ఘనంగా జరిగింది. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని, ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన ఆ మహనీయుని త్యాగనిరతి విస్మరించలేనిదన్నారు. అమరజీవి స్మారకభవనం నిర్మాణానికి అవసరమైన నిధులు సరిగా రావడంలేదని, అయినా కమిటీలోని సభ్యులందరం కలసి తమ శక్తిమేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. త్వరలోనే ఆంధ్రా ప్రభుత్వంతో సంప్రదించి నిధులు వచ్చేలా కృషిచేస్తామన్నారు. ఈ ఏడాది చివరిలోగా భవనంలో ఉన్న గ్రంథాలయాన్ని కూడా పునరుద్ధరిస్తామన్నారు. తాము అడగకుండానే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ భవనం కోసం 5 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారని, ఆ మొత్తంతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వ మాజీ కార్యదర్శి డా.పి.రామమోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆంధ్రరాష్ట్రం కోసం, తెలుగు భాష సంస్కృతుల అభివృద్ధి కోసం శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డా. సియంకె రెడ్డి, సమాఖ్య సభ్యులు కూడా పాల్గొని శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకున్నారు. తొలుత అందరూ ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. కన్యకాపరమేశ్వరి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ, కమిటీ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, సభ్యులు డా.విస్తాలి శంకరరావు, భువనచంద్ర, ఎం.ఎస్ లక్ష్మణ్‌రెడ్డి, డా.మాడభూషి సంపత్‌కుమార్, జేఎం నాయుడు, గుడిమెట్ల చెన్నయ్య, డా.శివకుమారి, ఆస్కా కార్యవర్గసభ్యులు ఎరుకలయ్య, తమ్మినేని బాబు, పిఆర్ కేశవులు పాల్గొన్నారు.


## ఉత్తరక్రియలు



మా తల్లి గారైన
శ్రీమతి **బయ్యా సరోజనమ్మ** గారు
(కీ.శే. బయ్యా వెంకట రమణయ్య గారి ధర్మపత్ని)
ది.09-03-2022 బుధవారం స్వర్గస్తులైనారు.
ది.23-03-2022 బుధవారం 15వ రోజు- శిలోద్వాసన
ది.24-03-2022 గురువారం 16వ రోజు సపిండీకరణం, పొత్తర్లు, వైకుంఠసమారాధన, ఆశీర్వచనములు.
పై కార్యక్రమములన్నియు మా స్వగృహమునందు జరుపబడును.
కావున తెలియపరచడమైనది.
పంక్తి : 24-3-22 మధ్యాహ్నం 12 గం॥లకు
ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ & పాన్ బ్రోకర్స్ అసోసియేషన్, రంగనాయకులుపేట, నెల్లూరు.

కుమారులు
**బయ్యా శ్రీనివాసులు**
**బయ్యా వెంకట రవికుమార్**

న్యూ రాజ్యలక్ష్మి హాల్ A/c
శుభమస్తు షాపింగ్ మాల్







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com